


ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 302 | గురువారం | 02-10-2025 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' విజయ దశమి శుభాకాంక్షలు.

### సెలవు

విజయ దశమి (దసరా) సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి గురువారం సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

- ఎడిటర్










ప్రజాపక్షం
గురువారం, 02 అక్టోబరు

# నిరంకుశత్వం వైపు అడుగులు!

దేశం నిరంకుశత్వం దిశగా అడుగులు వేస్తున్న ధోరణులు పెరుగుతున్నాయి. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అమలుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలే నిదర్శనం. ఇది ఖర్చులను తగ్గిస్తుందని, అంతులేని 'ఎన్నికల సర్కస్'కు తెరపడుతుందని, స్థూల జాతీయోత్పత్తి 1.5 శాతం పెరుగుతుందని బిజెపి గొప్పగా చెబుతున్నప్పటికీ, ప్రతిపక్ష పార్టీల ప్రకారం ఇది అతిపెద్ద ఎన్నికల మోసం. రాజకీయ పునర్నిర్మాణంతో సహా ఒక పెద్ద ప్యాకేజీలో భాగం. నయాఉదారవాద ప్రాజెక్ట్ ఎంపిక చేసుకున్న పెద్ద లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి రాచమార్గం. రాజకీయ అధికార కేంద్రీకరణ.. సమాఖ్యవాదం విధ్వంసం.. కార్పొరేట్ ఆర్థిక సామ్రాజ్యం.. దాని ఆశ్రిత వర్గాలకు మరింత ప్రత్యేక హక్కుల కల్పన వంటి అత్యంత ప్రమాదకర భవిష్యత్తుకు ఊతం. ఎన్నికల ఖర్చు భారీగా తగ్గుతుందని, తద్వారా ఖజానాకు గొప్ప మేలు జరుగుతుందనే వాదన పూర్తిగా ఊహాజనితం. ఎందుకంటే, భారత ఎన్నికల కమిషన్ ఎన్నికలపై చేసే పరిపాలనా వ్యయం చాలా తక్కువ. అధికారిక గణాంకాల ప్రకారం, ఈ వ్యయం 1952లో రూ. 10.5 కోట్ల నుండి 2014లో రూ. 3,870.3 కోట్లకు పెరిగింది. తదుపరి పెరుగుదలలను అనుమతించినప్పటికీ, కేంద్ర బడ్జెట్‌లో దీని వాటా నామమాత్రమే. ఏరకంగా చూసినా, ఒకేసారి ఎన్నికల నిర్వహణ వల్ల ఖర్చు తగ్గడం.. అర్థవంతమైన పొదుపు అద్భుతాలు సృష్టించడం మాటలకే పరిమితం. నిజానికి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రచారాల ఖర్చును కలిపినప్పుడే, ఎన్నికల సమయంలో ధన ప్రవాహం చాలా విస్తారమవుతుంది. వివిధ స్వతంత్ర సర్వేల ప్రకారం 2019లో మొత్తం ఎన్నికల వ్యయం సుమారు రూ. 60,000 కోట్లు. 2024 నాటికి ఇది దాదాపు రెట్టింపు అయింది. ఒక్కోసారి సంవత్సరాలపాటు ఎన్నికలు స్తంభించిపోతున్న వ్యవస్థలో, ఒకేసారి ఎన్నికలు జరిపినంత మాత్రాన ఒరిగే ప్రయోజనం ఉండదు. ఇక స్వయం నియంత్రణలు, వ్యయంపై పరిమితులు ఓ నిరర్థక మిథ్యావాదానికి ప్రతీకలు. నిరాకారమైన పొదుపు వాదనతో ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలన్న ప్రతిపాదన ఆర్థికావసరం ఎంత మాత్రం కాదు. అది అధికారాన్ని ఏకీకృతం చేసే ప్రయత్నం. ఒకే ఎన్నిక ద్వారా తగ్గిన మొత్తాలను మూలధన వ్యయానికి మళ్లిస్తే, అది ప్రజలకు కాదు.. ప్రైవేటు రంగానికే మేలు చేకూరుస్తుంది. కార్పొరేట్ రంగానికి పన్నుల మినహాయింపు, లక్షల కోట్ల రూపాయల మేర బకాయిల రద్దు వంటి చర్యలతో కేంద్రం 'ప్రైవేటు సేవ'లో పునీతమవుతుంది! ప్రజాధనం దారి మళ్లింపు అధికారికమవుతుంది. ధనిక, పేద వర్గాల మధ్య అంతరం మరింత పెరుగుతోంది. వాస్తవం చెప్పాలంటే, ఆర్థికాంశాలు కాదు.. రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రం 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'ను తెరపైకి తెస్తున్నది. అమలు చేయడానికి ఒత్తిడి పెంచుతున్నది. ప్రస్తుత విధానంలో ప్రభుత్వాలు తరచూ ప్రజల వద్దకు వెళ్లాలి.. ఫిర్యాదులు వినాలి... కనీసం పాక్షికంగానైనా స్పందించాలి. కానీ, ఒకసారి ఎన్నికలు జరిగిన తర్వాత, ఐదేళ్లపాటు ప్రజలతో సంబంధం ఉండకపోతే, ప్రభుత్వాలది ఇష్టారాజ్యమవుతుంది. పరిమిత జవాబుదారీతనం సమాజానికి నష్టం. దేశానికి ప్రమాదకరం. ఐదేళ్లపాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి, నిరంకుశంగా ప్రభుత్వాన్ని నడిపించడానికి వీలు ఉంటుందన్న బిజెపి అభిప్రాయం స్పష్టమవుతున్నది. కార్పొరేట్ ఆర్థిక సామ్రాజ్యానికి ప్రభుత్వం బదిలీ చేసే నిధులతో పోలిస్తే సబ్సిడీలు.. రుణమాఫీలు.. వేతనాల పెంపు తదితర అవసరాలకు బదిలీ చేసే అదనపు వనరుల పరిమాణం నామమాత్రమే. ప్రజా సమస్యలను తీర్చడానికి 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' మంత్రదండమేమీ కాదు. దీని వల్ల పునఃపంపిణీతోపాటు ఆహారం, వేతనాలు, సంక్షేమం కొత్తపుంతలు తొక్కుతుందనేది ఓ అభూత కల్పన. కార్పొరేట్ పన్ను మినహాయింపులు, ప్రైవేటీకరణ, కార్పొరేట్ భూ కబ్జాలకు నయాఉదారవాద ప్రభుత్వాలు ఊతమిస్తాయి. శ్రామిక ప్రజల బేరసారాల శక్తిని బలంగా అణగదొక్కుతాయి. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో కార్పొరేట్ దురాక్రమణ పెచ్చరిల్లుతుంది. సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపడుతుంది. రాజ్యాంగ విలువలు క్షీణిస్తాయి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. మరోవైపు, రాజ్యాంగ వ్యతిరేక 'డబుల్ ఇంజిన్ కీ సర్కార్' విధానాన్ని సంస్థాగతీకరించడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. కేంద్రం, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉంటే ప్రజలకు మేలు, అద్భుత ప్రయోజనాలు ఏవీ ఉండవుగానీ, పాలక వర్గ రాజకీయ పునర్నిర్మాణం మాత్రమే వేగవంతమవుతుంది. కార్పొరేట్ ఆర్థిక సామ్రాజ్యం మరింత బలోపేతం అవుతుంది. ఈ విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, దేశానికి అత్యంత ప్రమాదకరమైన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే బిజెపి ప్రతిపాదనను ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ముక్తకంఠంతో తిరస్కరించాలి. ఇది చట్టంగా మారకుండా, దేశం యావత్తు ఒకేతాటిన నిలబడి ప్రతిఘటించాలి. నిరంకుశ పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలి.

## రేపు ప్యారిస్‌లో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య 80వ వార్షికోత్సవాలు

### అదే రోజున పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాగతాలపై

# రాష్ట్రంలో కార్మిక సంఘాల నిరసన



ఎస్.బాల్‌రాజ్
ప్రధాన కార్యదర్శి

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) 80వ వార్షికోత్సవాలు ఫ్రాన్స్ దేశంలోని ప్యారిస్‌లో నుండి 05.10.2025 వరకు జరుగుతున్నాయి. ప్రపంచ కార్మికలోకంపై జరుగుతున్న శ్రమదోపిడి, కార్మిక చట్టాలు అమలుకై 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 3వ తేదీ నుంచి ప్యారిస్‌లో జరిగే ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య వార్షికోత్సవాలు కార్మికవర్గ ఐక్యతకు, పోరాటాలకు, ఉద్యమాలకు ఊపిరి కావాలని ఆశిద్దాం. భారతదేశ కార్మికవర్గంపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, ప్రపంచ దేశాలలో గ్రీస్లోని ఏథెన్స్‌లో కార్మికవర్గ పోరాటాలను విస్తృతపరుస్తూ ప్రపంచ కార్మికుల ఐక్యపోరాటాలు, ఉద్యమాలను డబ్ల్యుఎఫ్‌టియు చేస్తుంది. కార్మికుల పోరాటాలకు సానుభూతి, సహకారం, సమన్యాయం చేస్తూ కార్మికవర్గ పోరాటాలకు దోహదపడుతుంది.

డబ్ల్యుఎఫ్‌టియు ముఖ్య ఉద్దేశ్యం ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి. అదేవిధంగా ప్రపంచంలోని ఏ దేశాల మధ్యనైనా యుద్ధం నిలిపేందుకు కృషి చేస్తుంది. 1945లో డబ్ల్యుఎఫ్‌టియు ఏర్పడింది. 1949లో చీలిక ఏర్పడినా, తిరిగి ఆ సంఘాలన్నీ డబ్ల్యుఎఫ్‌టియుతోనే అనుబంధంగా మారాయి. డబ్ల్యుఎఫ్‌టియు తమ ఉద్దేశ్యాలను, ఆశయాలను కొనసాగిస్తున్నది. ప్రధానంగా పారిశ్రామిక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాతోపాటు యూరప్ దేశాలు, కార్మిక సంఘాల ఐక్యతతో పోరాటాలు కొనసాగిస్తున్నాయి. ప్రధాన ఉద్దేశం, ఆశయా లు, ప్రపంచ కార్మిక లోకం చేసే అన్ని పోరాటాలకు, ఉద్యమాలకు, చేస్తున్న సమ్మెలకు మద్దతు ఇస్తూ, కార్మికుల పోరాటాలు వారి హక్కులు కాపాడటంలో గొప్ప సహకారం, ప్రోత్సాహం అందిస్తుంది. కార్మికవర్గ పోరాటాలు వర్గరీత్యా కార్మిక సంఘాలకు అండగా ఉంటూ వారి పోరాటాలు నీరుగారిపోకుండా, అక్రమంగా తొలగించకుండ గౌరవప్రదమైన జీవితం గడిపే విధంగా కార్మికుల ఔన్నత్యాన్ని కాపాడుతుంది.

కార్మిక వర్గానికి యూనియన్ పెట్టుకొనే హక్కు చట్టబద్ధం చేయాలని, వివక్షత లేకుండా "పనిచేసే హక్కు ప్రాథమిక హక్కు" కావాలని, సెలవులతో కూడిన వేతనాలు చెల్లించాలని, డబ్ల్యుఎఫ్‌టియు నిరంతరం పోరాడుతోంది. సామాజిక చట్టాలను అమలుచేసేలా డబ్ల్యుఎఫ్‌టియు అథెన్స్, గ్రీస్ కింద ఉండి ప్రపంచ కార్మికవర్గాన్ని తమ హక్కుల కొరకు పోరాడుతుంది.


డబ్ల్యుఎఫ్‌టియు ప్రదర్శనలు చేస్తుంది. భారీ సంఖ్యలో కార్మికవర్గాన్ని సమీకరిస్తుంది. మానవత్వంతో సహాయ సహకారాలను అందిస్తుంది. తమ ఆశయాలను, ఉద్దేశ్యాలను విస్తృతంగా ప్రచారం చేస్తుంది. అనుబంధ యూనియన్‌లకు ఇతోధిక సహాయ సహకారం అందిస్తుంది. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ఎప్పటికప్పుడు కార్మికవర్గానికి తోడ్పాటునిస్తుంది.

డబ్ల్యుఎఫ్‌టియు గౌరవ అధ్యక్షులు జార్జ్ మావ్రికొస్ 2024 డిసెంబరు 2న భారతదేశ అన్ని సంఘాలు నిర్వహించిన సెమినార్‌లలో ప్రసంగించారు. ప్రపంచ కార్మికులను ఏకంచేసి ఎల్లలు లేని ప్రపంచాన్ని నిర్మించడమే లక్ష్యంగా డబ్ల్యుఎఫ్‌టియు పనిచేస్తుంది.

ప్రపంచంలో ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 1860లో మొదటి ట్రేడ్ యూనియన్ లండన్‌లో ఏర్పడింది.

1920లో లాలా లజపతిరాయ్, జోసెఫ్, బాప్టిస్టా, ఎన్.ఎం. జోషి, దివాన్ చమన్‌లాల్ ఎఐటియుసి నాయకులు, లాలా లజపతి రాయ్ మొదటి ఎఐటియుసి అధ్యక్షులు. ఇది డబ్ల్యుఎఫ్‌టియులో క్రియాశీల పాత్ర పోసిస్తున్నది.

డబ్ల్యుఎఫ్‌టియు సభ్యత్వం 2022లో 105 మిలియన్‌లు. సభ్యత్వం గణనీయంగా పెరిగి 134 దేశాలు ప్రపంచ కార్మిక సమాఖ్యలో చేరాయి. 2025లో ప్యారిస్‌లో జరిగే 80వార్షికోత్సవ సభలో మరింత పెరిగే అవకాశం ఉన్నది. భవిష్యత్తులో సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని, సమ సమాజం స్థాపించాలనే ఆశయంతో పయనిస్తున్నారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య అక్టోబరు 3 నుండి 5 వరకు ఫ్రాన్స్‌లో జరుగుతున్నాయి. ఇందులో ప్రపంచ కార్మిక సంఘాలు, అంతర్జాతీయ ఉద్యమాల తీరుతెన్నులపై అనుభవాలను పంచుకొనే అవకాశం ఉంది. అలాగే కార్మికుల భవిష్యత్తు కార్యాచరణపై చర్చ జరిగి, నూతన దిశా నిర్దేశం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.




**పాలస్తీనాకు డబ్ల్యుఎఫ్‌టియు సంఘీభావం**

వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ ప్రపంచ వ్యాపితంగా అన్ని ప్రాంతాలలో పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని, అండగా ఉండి విజయవంతం చేయాలని పిలుపును ఇచ్చింది.

ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా గాజా భూభాగాన్ని అక్రమంగా ఆక్రమించుకొని ఖనిజసంపదను దోచుకొనేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహకారంతో పాలస్తీనా ప్రజలపై, భూ భాగంపై దోపిడీ చేసేందుకు పాలస్తీనాను నామరూపాలు లేకుండా జరుగుతున్న దాడులను ఖండించాలి, నిరసనలు తెలపాలి అని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపునిస్తుంది.

ఇజ్రాయిల్ దేశ దురాగాతాల వలన ఇప్పటికే 65,000 మంది పాలస్తీనా ప్రజలను చంపడమే కాకుండ 1,50,000 మంది ప్రజలను ఏ పని చేయలేని విధంగా క్షతగాత్రులను చేసింది. దొంగ దెబ్బలు తీస్తు దోపిడీకి తెగబడుతుంది.

గాజా, పాలస్తీనా పౌరులు ఇజ్రాయేల్ దేశ దురాక్రమణకు వ్యతిరేకంగా జరుగుతున్న హత్యలకు వేలాది ప్రజలు, బాల బాలికలు, వందలాదిమంది డాక్టర్లు మరియు ఆరోగ్య సంరక్షక వర్కర్లపై ఇజ్రాయెల్ దేశం జరిపిన బాంబుదాడులలో వేలాదిమంది హతమయ్యారు. ఇందులో 200 మంది జర్నలిస్టులు కూడా చనిపోవడం విచారకరం.

పాలస్తీనా ప్రజలు గాజా పాలస్తీనాను కాపాడుకొనేందుకు 50 వేల మంది ప్రజానీకం పెద్ద ఎత్తున భారీ ప్రదర్శన నిర్వహించి పాలస్తీనా ప్రజలకు అండగా ఉన్నామని ఇజ్రాయిల్ దేశానికి వ్యతిరేకంగా నిలబడటం డబ్ల్యుఎఫ్‌టియు గొప్పతనమే.


పాలస్తీనాలోని గాజా ప్రాంతాన్ని ఆక్రమించుకొనేందుకు యుద్ధం చేయడానికి అవసరమైన ఆహార పదార్థాలను, ఆయుధాలను చేరవేసేందుకు ఇజ్రాయిల్ పోర్టులో ఎగుమతి చేయకుండా, గాజా పాలస్తీనాను ఆక్రమించుకోకుండా వేలాదిమంది ఇజ్రాయిల్ దేశ పౌరులు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడటం డబ్ల్యుఎఫ్‌టియు చేసిన కృషి వల్ల గాజా పాలస్తీనాపై దాడులు ఆగాయి.

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య గాజా పాలస్తీనా దురాక్రమణకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సేనలకు వ్యతిరేకంగా డాక్ వర్కర్స్ ఇటలీ, గ్రీస్, ఫ్రాన్స్, ఇతర ప్రధాన పోర్టులలో పనిచేస్తున్న కార్మిక సంఘాల ఫెడరేషన్లు ఐక్యంగా మిలటరీ ఆయుధాలు, మిలటరీ సామాగ్రి తరలించేందుకు నిరాకరించడం ప్రపంచ కార్మిక లోకానికి ఒక గొప్ప సంకేతం. ఇది డబ్ల్యుఎఫ్‌టియు 134 దేశాలలో చేస్తున్న సేవలకు గుర్తింపునిస్తుంది.

భారతదేశ కార్మికవర్గం ఇజ్రాయిల్‌లో దురాగాతాలను, పాలస్తీనా ఆక్రమిత ఖనిజసంపద దోపిడీని ఖండిస్తూ ఇజ్రాయిల్ మిలిటరి చర్యలను ఉపసహరించుకోవాలని, ఉగ్రవాద చర్యలను, ఇజ్రాయిల్ సైనిక చర్యలను నిలిపివేసి వెస్ట్ బ్యాంక్ నుండి సైనిక బలగాలను విడనాడాలని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్‌లు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 3న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నారాయణగూడ ఫ్లైఓవర్ కింద అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరుతున్నాం. తద్వారా అమెరికా సామ్రాజ్యవాద ఇజ్రాయిల్ దేశానికి హెచ్చరిక చేసేందుకు, ఎఐటియుసి, సిఐటియు కలిసి నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## గాంధీ జీవితం మనకు ఆదర్శం కావాలి

వలస పాలకుల కబంధ హస్తాల్లోంచి భరతమాతకు స్వేచ్ఛను ప్రసాదించడానికి అహింస, సత్య ధర్మాలు, సత్యాగ్రహం, సహనశీలత, స్వయం సమృద్ధి, స్వదేశీ వస్తు వినియోగం లాంటి పదునైన ఆయుధాలను ప్రయోగించి సఫలమైన జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శ జీవితం మనకే కాకుండా ప్రపంచ మానవాళి కూడా ఆదర్శంగా నిలిచింది, నేటికీ మనకు మార్గదర్శనం చేస్తూనే ఉన్నది. 02 అక్టోబర్ 1869న పోర్‌బందర్‌లో జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ పాఠశాల విద్య అనంతరం ఇంగ్లాండ్‌లో బారిస్టర్ కోర్సు పూర్తి చేసిన పిదప దక్షిణ ఆఫ్రికాలో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. దక్షిణ ఆఫ్రికాలో తాను చూసిన, అనుభవించిన జాతి వివక్ష పట్ల అహింసాయుత మార్గంలో వ్యతిరేకించారు, నాటి పౌర సమాజానికి ప్రేరణగా నిలిచారు. అతి సాధారణ జీవితాన్ని గడుపుతూ, ఉన్నత ఆలోచనలు చేస్తూ, సకల జీవుల పట్ల ఆదరణతో మన జీవితాలు కొనసాగాలని గాంధీ జీవితం సూచిస్తున్నది. 02 అక్టోబర్ 2025 రోజు గాంధీ జయంతితో పాటు విజయదశమి వేడుకలు కూడా కలిసిరావడం మరో అద్భుత సందర్భం.



మనం సాధించిన స్వతంత్ర భారతాన్ని సుందరంగా, సుసంపన్నంగా మార్చడానికి మనం నిత్యం కృషి చేయాలని ఆయన పిలుపును ఇవ్వడం మనకు తెలుసు. స్వాతంత్ర్యం కన్న పారిశుధ్యమే మిన్న అని కూడా ఆయన పేర్కొనడం జరిగింది. పచ్చని పరిశుభ్ర భారత్ నిర్మాణంలో మనం భాగస్వాములమై దేశభక్తులుగా రుజువు చేసుకోవాలి అని కూడా ఆయన పిలుపు ఇచ్చారు.

మహాత్ముని కలలను సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్ మిషన్' అనబడే ప్రతిష్ఠాత్మక జాతీయ పథకాన్ని 02 అక్టోబర్ 2014న ప్రవేశపెట్టి విజయవంతంగా 02 అక్టోబర్ 2019న భారత్‌ను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత దేశంగా మార్చడం, ప్రజారోగ్యానికి పట్టం కట్టడం మనకు తెలుసు. దేశ ఆర్థిక ప్రగతికి పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం ముడిపడి ఉంటాయని గాంధీ ప్రచారం చేసారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం హిందూ జాతీయతావాది నాథూరామ్ వినాయక్ గాడ్సే గాంధీని హత్య చేయడంతో 30 జనవరి 1948న కన్నుమూసారు. ఆయన చనిపోయిన రోజును షహీద్ దివస్‌గా కూడా నిర్వహించుకుంటున్నాం.

గాంధీ బోధనల్లో శాంతియుత సహజీవనం, నీతి నిజాయితీ, సింప్లిసిటీ, సామాజిక న్యాయం, దయ, కరుణలు, సమానత్వం, స్వయం క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, అహింస భావనలు, సమయం నియంత్రణ, పరమత సహనం, సమన్యాయం, నిస్వార్థ జీవన విధానం, దేశాభివృద్ధికి తోడ్పాటు లాంటి సుగుణాలు పొందుపరుచబడ్డాయి.

గాంధీ జయంతి రోజు విద్యాలయాల్లో గాంధీ జీవితం ఆధారంగా పలు పోటీల నిర్వహణ, సదస్సులు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, నాటకాలు, దేశ భక్తి పునాదిగా సాంస్కృతిక కార్యక్రమాలు లాంటి పలు కార్యక్రమాలను యువత పరివర్తన కేంద్రంగా నిర్వహించవచ్చు. దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీ వినియోగించిన అహింస, స్వయం సమృద్ధి, సత్య ధర్మ విలువలే పదునైన ఆయుధాలుగా లక్ష్యాలను సాధించిన గాంధీ జీవితం మనకు నిత్య ప్రేరణ కావాలి.

## మనలోని రావణున్ని దహనం చేయలేమా!

హిందూ కాలపట్టిక ప్రకారం ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం పదవ రోజున ప్రపంచవ్యాప్తంగా హిందూ పౌర సమాజం దసరా విజయదశమి వేడుకలను అత్యంత ఉత్సాహభరితంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుపోవడం జరుగుతున్నది. శ్రీరాముడు రాక్షస రావణుడిని సంహరించిన పవిత్ర రోజుగా మాత్రమే కాకుండా దుర్గాదేవి మహిషాసురుడిని వధించిన రోజుగా కూడా పర్వదినం జరుపుకోవడం కొనసాగుతున్నది. మహిషాసురుడనే రాక్షసుడితో తొమ్మిది రోజులు యుద్ధం చేసిన దుర్గాదేవి పదవ రోజుల అనంతరం ఆ రాక్షసుడిని సంహరించడం జరిగిందనే విషయం మనకు తెలుసు. పాండవులు అజ్ఞాతవాసం పూర్తి చేసుకొని తిరిగి తమ ఆయుధాలను జమ్మిచెట్టుపై నుంచి తీసి పూజలు చేసిన అనంతరం కౌరవులను ఓడించారని కూడా మనం శమీ పూజలు నిర్వహిస్తాం, జమ్మి ఆకును బంగారంగా భావించి మన ఆత్మీయులతో పంచుకుంటూ, అందరం క్షేమంగా, సురక్షితంగా ఉండాలని ప్రార్థనలు చేస్తాం. చెడుపై మంచి, అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం విజయంగా విజయదశమి పర్వదినం నిలుస్తున్నది. మనం కూడా మన జీవిత లక్ష్యాలను సుసాధ్యం చేసుకోవడానికి మనలో ఉన్న బలహీనతలు లేదా చెడు అలవాట్లను త్యాగం చేసుకుంటూ బలాలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు సాగడానికి ఈ పర్వదినం ప్రేరణగా నిలుస్తున్నది. ఆయుధ పూజను చేసే ఆచారం మనలో జీవన సాఫల్య నైపుణ్యాలను పెంపొందించుకోవడాన్ని సూచిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో శరన్నవరాత్రి, తెలంగాణలో బతుకమ్మ పండుగలను శక్తి స్వరూపిణి ప్రతిరూపాలుగా పూజలుగా నిర్వహించుకుంటున్నాం. దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. మరునాడు వచ్చే మహర్నవమి అనంతరం వైభవంగా విజయదశమి వేడుకలు నిర్వహిస్తారు. శమీ పూజ, అపరాజిత పూజలను ఈ పవిత్ర దినాన నిర్వహిస్తారు. చెడుపై మంచి విజయంగా పదితలల రావణుడిని శ్రీరాముడు సంహరించిన రోజుగా రావణుడి దిష్టి బొమ్మను 'రావణ వధ' లేదా 'రావణ దహనం' కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతోంది. ఆ విధంగా తొమ్మిది రోజుల (నవరాత్రుల) పూజ అనంతరం పదవ రోజు విజయదశమి వేడుకలు నిర్వహించుకుంటున్నాం.

ఈ రోజున దేశవ్యాప్తంగా దుర్గ, సరస్వతి, లక్ష్మి, గణేశ్ విగ్రహాలను సమీప నదుల్లో లేదా జలాశయాల్లో నిమజ్జనం చేస్తారు. పూజించాల్సిన వాహనా లు, ఆయుధాలు, పనిముట్లను శుభ్ర పరుచుకోవడం, ఆయుధాలను ఎరుపు వస్త్రాల్లో ఉంచడం, పవిత్ర గంగా జలాలను చల్లి శుద్ధి చేయడం, పసుపు, కుంకుమ, గంధం, పూల మాలలు సమర్పించడం, దీపం వెలిగించి ధూపం వేయడం, జమ్మి ఆకులతో పూజ చేయడం, అక్షింతలు, స్వీట్స్ సమర్పించడం లాంటి పవిత్ర ఆచారాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుపోవడం ఆనవాయితీగా వస్తున్నది.

మనలోని రాక్షస ఆలోచనలకు నిప్పు పెట్టి, సదాలోచనలకు పూజలు చేసి ఆహ్వానించి మన జీవితాల్లో కూడా మనం విజయ తీరాలు చేరాలని విజయదశమి వేడుకలు బోధిస్తున్నాయి. చదువుతో పాటు సంస్కారం, అవసర నైపుణ్యాలను కూడగట్టుకొని, ఆ నైపుణ్యాలను పదునైన ఆయుధాలుగా మలుచుకొని మన లక్ష్యాలను ఛేదించే ప్రయత్నాలను మనఃస్ఫూర్తిగా చేద్దాం. సామరస్యం, శక్తి రూపం, ఐక్యత, చెడు త్యాగం, మంచిని ఆహ్వానించడం లాంటి లక్షణాలే చిహ్నాలుగా విజయదశమి దసరా వేడుకలు నిర్వహించుకుంటున్నాం. మనలోని చెడు ఆలోచనలపై మంచి భావనలు విజయం సాధించాలని కోరుకుందాం. విజయదశమి శుభవేళ ఏ పని ప్రారంభించినా విజయం వరిస్తుందని బలంగా నమ్ముతాం. సరికొత్త ఆలోచనలకు ఈ విజయదశమి శుభారంభం కావాలని ఆ దుర్గామాతను, శ్రీరామచంద్రుడు స్వామిని మనసారా కోరుకుందాం.

## జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణులు

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడుతున్నది. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవ వైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోనియెడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడగక ముందే కూడు, గూడు, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 02– 08 అక్టోబర్ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు లేదా నేషనల్ వైల్డ్ లైఫ్ వీక్ నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయన్న భయంకర వాస్తవం నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపుటంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపి ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. భారతీయ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజియమ్స్ అండ్ జూస్ అనే సంస్థ జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. భారత ప్రజలు, భూగోళం పరిరక్షణకు పెట్టుబడులు పెట్టడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ జనాభా ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని కోరడం జరుగుతున్నది.




జాతీయ వన్యప్రాణి వారోత్సవాల వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమా లు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి.

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటితరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.

(02–08 అక్టోబర్ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు సందర్భంగా)

## 'ఆదర్శమూర్తి' లాల్ బహదూర్ శాస్త్రి

వేసవికాలం ఎండల్లో సలసలమని మండుతున్న వీధులలో కాళ్లకు చెప్పులు లేకుండా మైళ్లకొద్దీ నడిచి పాఠశాలకు వెళ్లిన బాలుడు; స్వాతంత్ర్య పోరాటంలో ఏడేళ్లు జైలులో గడిపిన ధైర్యశాలి; దేశ ప్రధాన మంత్రి అయిన తర్వాత కూడా కఠినమైన నిరాడంబర జీవితాన్ని గడిపిన ఆదర్శమూర్తి ఎవరో కాదు. ఆయనే లాల్ బహదూర్ శాస్త్రి. పదహారేళ్ల వయసులోనే గాంధీ పిలుపుకు స్పందించి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. వివాహంలో కేవలం చేనేత వస్త్రం, ఒక రాట్నాన్ని మాత్రమే కానుకగా తీసుకున్నారు. 'శాస్త్రి' అనే స్నాతకోత్సవ పట్టానే తన పేరులో భాగంగా చేసుకున్న ఈ ధీరుడు, భారతదేశ రెండవ ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించారు. శాస్త్రి అక్టోబరు 2, 1904న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి ఏడు మైళ్ల దూరంలో ఉన్న మొఘల్ సరాయ్ అనే చిన్న పట్టణంలో శారదా ప్రసాద్ శ్రీవాస్తవ, రామదులారీ దేవి దంపతులకు జన్మించారు. ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడే తన తండ్రిని కోల్పోయారు. పదవ తరగతి చదువుతున్న సమయంలో బెనారస్‌లో మహాత్మాగాంధీ, పండిట్ మదన్మోహన్ మాలవీయలు నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు వైదొలిగి సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరాలని మహాత్ముని పిలుపుతో ప్రేరణ పొందిన శాస్త్రి, తను చదువుతున్న పాఠశాల నుండి బయటకు వచ్చి పికెటింగ్, బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. లాలా లజపత్ రాయ్ స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ పోరాటంలో భాగంగా మొత్తం ఏడేళ్ల పాటు జైలు జీవితాన్ని గడిపారు. 1937, 1946 సంవత్సరాలలో యునైటెడ్ ప్రావిన్స్‌కు ప్రతినిధిగా ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు, జాతీయ నేతలు శాస్త్రి అపార శక్తి సామర్థ్యాలను గుర్తించారు. దేశ నిర్మాణంలో పాలుపంచుకోవలసిందిగా పిలుపు వచ్చింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో పార్లమెంటరీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. కొద్దికాలంలోనే స్వయంకృషితో రాష్ట్ర హోం, రవాణా శాఖ మంత్రిగా ఎదిగారు. రవాణా వ్యవస్థలో మొట్టమొదటిసారిగా మహిళా కండక్టర్లు ఆయన హయాంలోనే నియమించబడ్డారు. అల్లరి మూకలను చెదరగొట్టడానికి లాఠీలకు బదులు వాటర్ జెట్‌లను వినియోగించాలని పోలీసులకు సూచించారు. కఠోర శ్రమకు, సామర్థ్యానికి ఉత్తరప్రదేశ్‌లో శాస్త్రి ఒక సమున్నత సంకేతంగా నిలిచారు. తన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వ పెద్దలు ఆయన్ని కేంద్ర రాజకీయాలలోకి రమ్మని ఆహ్వానించారు.



**యువతకు స్ఫూర్తిదాయకం:** భారత ప్రభుత్వం 1966లో లాల్ బహదూర్ శాస్త్రికి మరణానంతరం భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన "భారతరత్న"తో సత్కరించింది. వినయం, సహనం, దృఢచిత్తం, అద్భుతమైన అంతఃశక్తితో కూడిన ఆయన ప్రజల మనసును అర్థం చేసుకున్న నాయకుడిగా ఎదిగారు. అంతేకాదు, గొప్ప దూరదృష్టితో దేశాన్ని ప్రగతి బాటలో ముందుకు తీసుకెళ్లారు. దేశ ప్రధానమంత్రిగా పదవి నుంచి దిగిపోయాక కూడా, మరణించే సమయానికి ఒక ఇల్లు కూడా లేని శాస్త్రి నిరంతర సేవామయ జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం.




ప్రతి అక్షరం ప్రజల కోసం
www.prajapaksham.in
# ప్రజాపక్షం
సంపుటి 08, సంచిక: 302 | గురువారం | 02-10-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

PRAJAPAKSHAM ★★



## అజ్ఞాతం వీడండి
● లొంగిపోయిన మావోయిస్టులకు వేధింపులు ఉండవు ● స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహిస్తాం ● ఈ ఎన్నికలు సవాలుగా నిలిచాయి ● బాధ్యతల స్వీకరణలో నూతన డిజిపి శివధర్‌రెడ్డి
06

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3% డిఎ
కేబినేట్ నిర్ణయం
జూలై 1 నుంచి అమలులోకి
57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఒకే
రబీ పంటల కనీస మద్దతు ధర పెంపు ప్రతిపాదనకు ఆమోదం
05

ట్రంప్ గాజా శాంతి ప్రణాళిక
## ఆక్రమణకు కొత్త ముసుగు
న్యాయమందించే మార్గం కాదు
సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శ
05

## సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో భూకంపం
కుప్పకూలిన భవంతులు : 69 మంది మృతి
శిథిలాల్లో చిక్కుకున్న పౌరులు



# వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి

● బిహార్ ఎన్నికల్లో 96 లక్షల కుటుంబాలకు రూ.10వేల చొప్పున పంపిణీ చేసిన బిజెపి ధనబలంతో గెలిచే యత్నం : సిపిఐ విమర్శ ● ప్రజలను మతపరంగా చీల్చుతూ అధికారాన్ని కేంద్రీకృతం చేసే కుట్ర : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మండిపాటు ● సిపిఐ 100 ఏళ్ల జాతీయస్థాయి ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న నిర్వహించనున్నట్లు వెల్లడి ● బిజెపిది లూటీకోరు ప్రభుత్వం : సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలో అధికార బిజెపికి అగ్ని పరీక్షలాంటి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందేందుకు ఆ పార్టీ ధన ప్రవాహానికి తెర లేపిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. అందులో భాగంగానే బిహార్‌లో 96 లక్షల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున పంపిణీ చేసిందని విమర్శించారు.హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నరసింహాలు పాల్గొన్నారు.

పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ వ్యవస్థలన్నింటిని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ప్రజలను మత పరంగా చీల్చడంతో పాటు ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని అధికారాన్ని కేంద్రీకృతం చేసే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. బిజెపి ఫాసిస్టు విధానాలను వామపక్ష పార్టీలన్నీ కలిసి కట్టుగా ఎదుర్కోనట్లయితే దేశం ప్రమాదంలో పడనుందని సిపిఐ జాతీయ మహాసభల వేదికగా ప్రధాన వామపక్ష పార్టీల నాయకులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. ఇండియా కూటమి ఏర్పాటు ద్వారా బిజెపి బలాన్ని 240కి తగ్గించగలిగామని, మరింత ఐక్యంగా ముందుకు సాగడం ద్వారా బిజెపిని కట్టడి చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. సిపిఐ సంస్థాగతంగా, సైద్ధాంతికంగా బలోపేతం చేసుకోవడం ద్వారా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ దేశ వ్యాప్తంగా బలమైన ప్రజా ఉద్యమాలకు సంసిద్ధం కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సిపిఐ జాతీయ మహాసభలో తెలంగాణకు సరైన ప్రాతినిధ్యం లభించిందన్నారు. పార్టీలో యువతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలనే నిర్ణయం మేరకు ఈ మహాసభలో 75 ఏళ్లు నిండిన నాయకులంతా ప్రధాన బాధ్యతల నుంచి తప్పుకున్నారని పల్లా వెంకటరెడ్డి వెల్లడించారు.

**డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభ**


సిపిఐ 100 ఏళ్ల జాతీయ స్థాయి ముగింపు ఉత్సావాలను డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు పల్లా వెంకట రెడ్డి తెలిపారు. సిపిఐ జాతీయ నాయకులతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్య నేతలు పాల్గొంటారని వెల్లడించారు. బహిరంగ సభకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేయనున్నట్లు తరువాయి 6లో











# జాతీయం ప్రపంచం



## రాష్ట్ర పర్యటనలు వాయిదా వేసుకున్న టివికె చీఫ్ విజయ్



**చెన్నై:** టివికె పార్టీ చీఫ్, సినీ నటుడు విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటనలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త పర్యటనలను రెండు వారాల పాటు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కరూర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో టివికె పార్టీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇటీవల విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41మంది మృతిచెందిన ఘటన తీవ్ర విషాదం నింపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టివికె వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. తొక్కిసలాట ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన బాధ, దుఃఖం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చే రెండు వారాల పాటు బహిరంగ సభ కార్యక్రమాన్ని తాత్కాలికం గా వాయిదా వేస్తున్నాం. పర్యటనలకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను త ర్వాత ప్రకటిస్తామని మా నేత ఆమోదంతో తెలియపరుస్తున్నాం అని పార్టీ హెడ్ సెక్రటేరియట్ ప్రకటించింది.

## ట్రంప్ గాజా శాంతి ప్రణాళిక... ఆక్రమణకు కొత్త ముసుగు


సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ధ్వజం

**న్యూఢిల్లీ :** గాజా కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన '20 సూత్రాల శాంతి ప్రణాళిక' అస్పష్టత, అత్యంత సందిగ్ధత, వివక్షతతో కూడిన కసరత్తు తప్ప అందులో సదుద్దేశం ఏమీ లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విమర్శించింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తరపున బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఇక్కడ ఒక ప్ర కటన విడుదల చేశారు. ట్రంప్ 20 సూత్రాల శాంతి ప్రణాళిక వెస్ట్ బ్యాంక్ గురించి ఏమాత్రం ప్రస్తావించకపోవడం గమనార్హమని డి.రాజా పేర్కొన్నారు. తాను అందిస్తున్నది శాంతి కోసం తాను ఒక రోడ్ మ్యాప్‌ను అందిస్తున్నానని తనను తాను ప్రాజెక్ట్ చేసుకుంటున్న డొనాల్డ్ ట్రంప్ పాలస్తీనా దేశ హోదా గురించి అతిస్వల్పమైన, అస్పష్టమైన సూచనను మాత్రమే అందిస్తూ పాలస్తీనా భూభాగాలపై ఇజ్రాయెల్ సైనిక ఆధిపత్యంపై తలెత్తే ప్రాథమిక ప్రశ్నను ఏమాత్రం తాకకుండా వదిలేయడం శోచనీయమన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక సంఘర్షణకు మూల కారణాలను పరిష్కరించడానికి బదులుగా, పాలస్తీనా ప్రజల దైనందిన బాధలపై ఏ మా త్రం దృష్టి సారించకుండా, ఇజ్రాయెల్ కనుసన్నలకు అనుగుణంగా ఆక్రమణను నిర్వహించడానికి దోహదపడటం ఆక్షేపణీ యమన్నారు. దురాక్రమణ యుద్ధాలలో తన పా త్రకు అపఖ్యాతిపాలైన టోనీ బ్లెయిర్ వంటి వ్యక్తుల ను శాంతి సంరక్షకులుగా దారుణంగా నూరిపోస్తోందన్నారు. అంతేకాకుండా ఏదైనా చట్ట బద్ధమైన ప్రక్రియను తొలగించే చర్యను నిర్వీ ర్యం చేసేందుకు ఈ శాంతి ప్రణాళిక ఒక సరికొత్త ఎత్తుగడ అని డి.రాజా ధ్వజమెత్తారు. ఇ జ్రాయెల్ ఉ పసంహరణ లేదా అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి విశ్వసనీయమైన యంత్రాంగాన్ని అందించదని, పాలస్తీనియ న్ల రాయితీలు ఇవ్వాలని, నిరాయుధీకరణ చేయాలని డిమాండ్ చేయడం అంతే ప్రమాదకరమైనదని సిపిఐ ఆరోపించింది. తక్షణమే కాల్పుల విరమణ, ఖైదీల విడుదలతో నిజమైన శాంతి ప్రక్రియను వెంటనే ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ గట్టిగా నొక్కి చెప్పింది. దశాబ్దాలుగా భూభాగాలపై పె త్త నం కొనసాగిస్తున్న సామ్రాజ్యవాద శక్తులు ఈ ప్రక్రియను నడిపించలేవని, బదులుగా న్యాయమైన ఫలితాన్ని నిర్ధారించడానికి భారతదేశం సహా ప్రపంచంలోని దక్షిణ దేశాలు ఈ బాధ్యతను చేపట్టాలని సిపిఐ కోరింది. తూ ర్పు జెరూసలేంతో 1967 సరిహద్దులను రాజధానిగా చేసుకుని పూర్తి పాలస్తీనా దేశ హోదాను హామీ ఇవ్వడమే సిపిఐ భావించే నిజమైన పరిష్కారమని, ఇది లేకుండా న్యాయం లేదా శాంతిని తీసుకురాలేమని, గాజా కోసం ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళిక కొత్త ముసుగులో ఆక్రమణ కొనసాగింపు కోసం మాత్రమేనని సిపిఐ స్పష్టం చేసింది.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మూడుశాతం కరువుభత్యం పెంపు

● ఆరు రబీ పంటలకు పెరిగిన మద్దతు ధరలు ● కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు
● దేశమంతటా 'వందేమాతరం' 150వ వార్షిక వేడుకలు ● కేంద్రమంత్రివర్గం నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కరువు భత్యం (డిఎ), కరువు సహాయం (డిఆర్) మూడుశాతం పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనివల్ల 49.19 లక్షలమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మరో 68.72 లక్షలమంది పింఛనుదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఆరు రబీ పంటలకు 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను కనీస మద్దతు ధర పెంచుతూ మరో నిర్ణయం తీసుకుంది. పప్పుధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు వీలుగా రూ.11,440 కోట్లతో ఆరు సంవత్సరాల పథకాన్ని ఆమోదించింది. కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలను దేశంలో ఏర్పాటు చేస్తారు. బెంగాలీ కవి బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' గీతాన్ని రచించి 150 సంవత్సరాలు (1876) పూర్తవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా వార్షికోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మొత్తం ఆరు కీలక తీర్మానాలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించినట్లు సమాచార,ప్రసారాలశాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఇప్పటివరకూ కేంద్ర ఉద్యోగులకు 55 శాతంగా ఉన్న డి ఎ ఇక మీదట 58 శాతానికి పెరుగుతుంది. దీనివల్ల కోశాగారంపై ఏటా రూ.10,083.96 కోట్ల భారం పెరుగుతుంది. దీపావళి కానుకగా కేంద్రమంత్రివర్గం బుధవారంనాటి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏడవ వేతన కమిషన్ సిఫార్సులను సమ్మతించిన సూత్రాల ప్రాతిపదికపై డిఎ పెంపు నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి చెప్పారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండుసార్లు కరువుభత్యం, కరువుసహాయాలను సవరిస్తుంది. వస్తుసేవల పన్నులో రెండో తరం సంస్కరణలు గతనెల 22వ తేదీ నుండీ అమలులోకి తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం వినియోగ వ్యయాలకు మరింత బలం చేకూర్చేదిశగా పండుగవేళ ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలనే ఎంపిక చేసిన 10.91 లక్షలమంది ఎంపిక చేసిన రైల్వే ఉద్యోగులకు ఉత్పాదకతతో ముడిపడిన 78 రోజుల బోనస్ ప్రకటించింది. జిఎస్‌టిలో రెండు అంచెల పన్నులవల్ల దేశంలో భారీగా కొనుగోళ్ళు పెరుగుతాయని, చిన్నసూక్ష్మ,మధ్యతరహా పరిశ్రమలకు భారీ ప్రోత్సాహం వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న మోదీ ప్రభుత్వం ఈ వరుస నిర్ణయాలు ప్రకటిస్తోంది.



### క్వింటాలు గోధుమకు రూ.2,585లు మద్దతు ధర

ఆరు రబీ పంటలకు మద్దతు ధరలు (ఎంఎస్‌పి) పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పప్పుధాన్యాల స్వయంసమృద్ధికి ఆరు సంవత్సరాల పథకాన్ని ఆమోదించింది. కాగా క్వింటాలు గోధుమలకు మద్దతు ధర రూ.2,585 కు పెంచారు. ఈ ధర 2026–27 మార్కెట్ సంవత్సరం నుండి అమలులోకి వస్తుంది. మొత్తంగా ఈ ధర 6.59 శాతానికి పెరిగింది. గత ఏడాది ఈ ధర రూ.2,425లుగా ఉంది. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) సిఫార్సుల ప్రాతిపదికపై ఆరు రబీ పంటలకు ఎంఎస్‌పి పెంచినట్లు మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. కుసుమ పంటకు క్వింటాలుకు రూ.600 ధర నిర్ణయించారు. పెసలు క్వింటాలు ధర రూ.300, కందులు,ఆవాలుకు క్వింటాలు ధర రూ.250లు, అపర ధాన్యాలకు క్వింటాలు ధర రూ.255లు, బార్లీకి రూ.170లు, గోధుమకు రూ.160లు క్వింటాలు ధర పెంచారు. బార్లీకి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.1,980 నుండి రూ.2,150లుకు పెరిగింది. కీలకమైన రబీ పప్పు ధాన్యాలకు మద్దతు ధరలను క్వింటాలుకు రూ.5,650 నుండి రూ. 5,875లకు పెంచారు. సగటున దేశంలో గోధుమ ఉత్పత్తి ఖర్చు 109 శాతంగా ఉంటుందని అంచనా. గోధుమకు 93 శాతంగా ఉంటుంది. అదే విధంగా పప్పుధాన్యాల పంటల ఉత్పత్తిలో భారతదేశాన్ని స్వయం సమృద్ధిదేశంగా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఆరు సంవత్సరాలపాటు అమలుచేసేవిధంగా ఒక పథకాన్ని ఆమోదించింది. దీనికోసం రూ.11,440 కోట్లు కేటాయించారు. ''పప్పుధాన్యాల ఉత్పత్తికి మిషన్ ఆత్మనిర్భర్'' పేరుతో ఈ పథకం అమలు చేస్తారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుండి 2030–31 ఆర్థిక సంవత్సరం వరకూ ఈ పథకాన్ని అమలు చేస్తారు. కందులు, మినుములు వంటి పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని కేంద్రం నిర్ణయించింది.

### కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు

దేశంలో కొత్తగా మరో 57 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల 86,000 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. కేంద్ర హోంశాఖ, రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఈ ఖర్చు పంచుకుంటాయి. మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.5,862.55 కోట్లు ఖర్చు చేస్తారు. 2026–27 ఆర్థిక సంవత్సరం నుండి తొమ్మిది సంవత్సరాలపాటు వీటి ఏర్పాట్లు జరుగుతాయి. ఇందులో మూలధనం రూ.2,585.52 కోట్లు కాగా, నిర్వహణా వ్యయం రూ.3,277.03 కోట్లుగా అంచనావేశారు. 1962లో ఈ కేంద్రీయ విద్యాలయ విధానం అమలులోకి వచ్చింది. ప్రస్తుతం దేశంలో 1,288 కేంద్రీయ విద్యాలయాలు పనిచేస్తున్నాయి. వీటిల్లో మాస్కో, ఖాట్మండు, టెహ్రాన్ దేశాలలో కూడా మూడు కేంద్రీయ విద్యాలయాలు పనిచేస్తున్నాయి. ఈ విద్యాలయాలలో మొత్తం 13.62 లక్షలమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా, 'వందేమాతరం' గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా వార్షికోత్సవాలు జరపాలని కూడా కేంద్రం నిర్ణయించింది. బంకించంద్ర ఛటర్జీ సంస్కృతంగా ఈ గీతాన్ని రచించారు. ఈ గీతానికి జాతీయ గీతం 'జనగణమన...'తో సమాన హోదా ఉంది. కాగా అసోం రాష్ట్రంలోని జాతీయ రహదారి–715లో కలియాబోర్–నుమలిగర్ సెక్షన్‌ను వెడల్పు చేసేందుకు రూ.6,957 కోట్లు కేంద్రం కేటాయించింది. ప్రస్తుతం ఈ జాతీయ రహదారి (పాత ఎన్‌హెచ్–37) రెండు రాకపోకల మార్గం చాలా రద్దీగా మారింది. దీనిని వెడల్పు చేస్తారు.

## రెండవసారీ యథాతథం

● వడ్డీరేట్లపై ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టీకరణ ● త్వరలోనే సడలింపులుఉంటాయని సంకేతాలు



**ముంబయి :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)వరుసగా రెండవసారి వడ్డీరేట్లను ఏ మాత్రం మార్పుచేయకుండా యథాతథంగా ఉంచింది.అమెరికా సుంకాల ప్రభావం, మునుపటి రేటు తగ్గింపు, ఇటీవల పన్ను తగ్గింపుల ప్రభావంపై మరింత స్పష్టత కోసం వేచి ఉన్న కారణంగా తన కీలక వడ్డీరేట్లలో మార్పు ఉండదని బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. అయితే అమెరికా సుంకాల నుండి ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడానికి రాబోయే నెలల్లో సడలింపులకు అవకాశం ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంకేతాలు ఇచ్చారు. ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ తిరిగి కొనుగోలు రేటును 5.5శాతం వద్ద మార్చకుండా ఉంచడానికి ఏకగ్రీవంగా ఓటువేసింది. భవిష్యత్తులో అవసరమైతే రెండు దిశలలోనైనా వెళ్లడానికి వెసులుబాటును ఇస్తూ 'తటస్థ' విధాన వైఖరిని కొనసాగించాలని నిర్ణయించింది. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ నేతృత్వంలోని సగంమంది బాహ్య నిపుణులతో కూడిన రేట్ సెట్టింగ్ ప్యానెల్, ఆగస్టులో జరిగిన మునుపటి త్రైమాసిక సమీక్ష సమావేశంలో విరామం తీసుకునే ముందు ఈ సంవత్సరం మొత్తం 100 బేసిస్ పాయింట్లు వడ్డీ రేట్లను తగ్గించింది. 'విధాన చర్యల ప్రభావం, తదుపరి కోర్సును రూపొందించే ముందు మరింత స్పష్టత వెలువడటానికి రేట్లను ఉంచడం వివేకం' అని మల్హోత్రా అన్నారు.'ప్రస్తుత స్థూల ఆర్థిక పరిస్థితులు, అంచనాల వృద్ధికి మరింత మద్దతు ఇవ్వడానికి విధానపరమైన అవకాశాలను తెరిచాయి' అని ఎంపిసి నిర్ణయాలను ప్రకటిస్తూ మల్హోత్రా చెప్పారు. అయితే ముందస్తు ద్రవ్యవ విధాన చర్యలు ఇటీవల ఆర్థిక చర్యల ప్రభావం ఇంకా కొనసాగుతోందని ఎంపిసి గుర్తించింది. అలాగే,వ వాణిజ్య సంబంధి త అనిశ్చితులు బయటపడుతున్నాయని, భారతదేశం నుంచి దిగుమతులపై అమెరికా 50శాతం సుంకం విధించడంతోపాటు హెచ్1బి వీసా నిబంధనలు కఠినతరం చేయడాన్ని ఆయన ప్రస్తావిస్తూ మాట్లాడారు. ఈ సంవత్సరం ఆసియాలో అ త్యంత దారుణంగా పనితీరు కనబరిచిన కరెన్సీ అయిన రూపాయి డాలర్‌తో పోలిస్తే 0.1 శాతం పెరిగి 88.70కి చేరుకుంది.అదే సమయంలో స్టాక్‌లు అత్యధికంగా ట్రేడ్ అ య్యాయి. వడ్డీరేట్లను నిలుపుకోవడంలో ఆర్‌బిఐ పోటీ ప్రాధాన్యతలను సమతుల్యం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. ఒకవైపు అమెరికా సుంకాల నుం డి అణిచివేసిన ద్రవ్యోల్బణం, వృద్ధి ప్రమాదాలు మరోపక్క రూపాయి పతనం. బలహీనమైన బాహ్య డిమాండ్ ఉన్నప్పటికీ దేశీయ చోదకుల మద్దతు, వృద్ధి అంచనా స్థిరంగా ఉందని మల్హోత్రా చెప్పారు. 'అనుకూల రుతుపవనాలు, తక్కువ ద్రవ్యోల్బణం, ద్రవ్య సడలింపు, ఇటీవలి జిఎస్‌టి సంస్కరణల సానుకూల ప్రభావం నుండి దీనికి మరింత మద్దతు లభించే అవకాశం ఉంది.' వృద్ధి ఇప్పటికీ ఆకాంక్షల కంటే తక్కువగానే కొనసాగుతోంది. జూన్ మూడు మా సాలలో భారతదేశ జిడిపి 7.8శాతం పెరిగింది' ఇది ఒక సంవత్సరంలోపే అత్యంత వేగవంతమైన వేగంగా భావించవచ్చు. ఆర్‌బిఐ కూడా ఈ సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను 2శాతానికి త గ్గించింది. ఇది సహన పరిమితి 4శాతం కంటే చాలా తక్కువే అని చెప్పాలి. ఇది గతంలో ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం దాదాపు 3.1శాతం ఉంటుందని అంచనా వేసింది. విదేశీ మారక ద్రవ్య నియమాల సడలింపు, ఇన్‌ఫ్రా ఫైనాన్సింగ్, నూతన విశ్వ లైసెన్సింగ్ డ్రాఫ్ట్స్, రూపాయి అంతర్జాతీయీకరణ, వాటాలపై రుణ పరిమితులను సడలించడం, ఇతర ఆర్థిక సాధనాల మధ్య క్రెడిట్ వృద్ధిని పెంచే చర్యలను మల్హోత్రా ప్రకటించారు. మొత్తం మీద ఈ విధానం ఇతర చర్యల ద్వారా వృద్ధి మద్దతు ఇవ్వడానికి బలమైన ధోరణిని కలిగి ఉంది. అదేసమయంలో రేటు కోత లు త్వరలో జరుగుతాయని పేర్కొంది. కోటక్ మహీంద్రా ముఖ్య ఆర్థికవేత్త ఉపాసన భరద్వాజ్ మాట్లాడుతూ అంచనాలకు అనుగుణంగా ఎంపిసి ఒక సానుకూల రేటు, వైఖరిని అందించిందన్నారు.

## గాజాలో దారుణాలపై మోదీ మౌనం పూర్తిగా ద్రోహం

ట్రంప్ ప్రణాళికపై కలవరపెట్టే ప్రశ్నలు మిగిలే ఉన్నాయ్ : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** గాజాలో జరిగిన భయంకరమైన దారుణాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పూర్తిగా మౌనం పాటిస్తున్నారని, ఇది నైతిక పిరికితనం, పూర్తి ద్రోహం అని కాంగ్రెస్ ఆరోపించింది. తన మంచి స్నేహితుడు అయిన అమెరి కా అధ్యక్షుడు ట్రంప్‌ను శాంతింపజేయడానికి, అతని మరొక స్నేహితుడు నెతన్యాహుకు సంఘీభావంగా ప్రధానమంత్రి మోదీ గాజా కోసం ట్రంప్ కొత్త గా 20 పాయింట్ల ప్రణాళికను స్వాగతించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. కానీ ఈ ప్రణాళికపై ప్రాథమిక, కలవరపెట్టే ప్రశ్నలు మిగిలే ఉన్నాయన్నారు. ప్రతిపాదిత పాలనా వ్యవస్థలో గాజా ప్రజలు ఎక్కడ ఉన్నారు? పూర్తి స్థాయి పాలస్తీనా రాజ్యం ఉనికిలోకి రావడాని కి రోడ్ మ్యాప్ ఎక్కడ ఉంది అని నిలదీశారు. యుఎస్, ఇజ్రాయెల్ పాలస్తీనా రాజ్యాన్ని ఎంతకాలం విస్మరిస్తాయని ప్రశ్నించారు. దీనిని ఇప్పటికే ఐక్యరాజ్యసమితిలోని 157 సభ్య దేశాలు గుర్తించాయి, భారతదేశం నవంబర్ 1988లో నాయకత్వం వహించిందన్నారు. గత ఇరవై నెలలుగా గాజాలో జరిగిన మారణహోమానికి జవాబుదారీతనం ఎక్కడ? అని జైరామ్ రమేష్ ఎక్స్ లో పేర్కొన్నారు. గాజాలో వేలాది మంది పౌరుల హత్యకు దారితీసిన భయంకరమైన దారుణాలపై ప్రధానమంత్రి పూర్తి మౌనం వహించారని, ఇది తీవ్రమైన నైతిక పిరికితనమని, పూర్తిగా మోసం చేయడమేనన్నారు. గాజాలో 'దౌర్జన్యాలపై మోదీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది.

## ఇండోనేసియా స్కూలు శిథిలాల్లో 91 మంది పిల్లలు!



**జావా:** ఇండోనేసియాలోని ఒక స్కూలు భవంతి కుప్పకూలిపోయిన శిథిలాల్లో దాదాపు 91 మంది విద్యార్థులు చిక్కుకుని ఉంటారని భయపడుతున్నారు. తూర్పుజావా పట్టణం సిడోయార్జోలోని అల్ ఖొజినీ ఇస్లామిక్ బోర్డింగ్ స్కూలు కుప్పకూలిపోవడంతో రెండు రోజులుగా ఈ ప్రాంతంలో సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయి. భారీ క్రేన్లు, తవ్వకం యంత్రాలను అక్కడికి రప్పించారు. శిథిలాల్లో ఉన్నవారిని కాపాడేందుకు సహాయ బృందాలు లోనికి ఆక్సిజన్ సరఫరా చేస్తున్నాయి. ఈ స్కూలులో చదువుతున్నవారంతా 12–17 వయసుగల విద్యార్థినీ విద్యార్థులే. సోమవారం సాయంత్రం ఈ స్కూలు భవనం కుప్పకూలిపోయింది. ఆ భవనంలో ఎక్కువమంది టీనేజ్ విద్యార్థులే ఉన్నారు. ఈ ప్రమాదంలో ప్రాథమికగా ముగ్గురు మరణించారని మంగళవారం అధికారులు చెప్పారు. మరో 99 మంది గాయపడ్డారు. వందలసంఖ్యలో విద్యార్థులు మరణించాల్సిన పెద్ద ప్రమాదం తప్పిపోయింది. ఒకవైపు భవంతి కూలిపోయిన సమయంలో అక్కడ చదువుకునే బాలికలు అనేకమంది కొంచెం దూరంగా ఉన్న గ్రౌండ్‌లో ప్రార్థనా కార్యక్రమంలో నిమగ్నమై ఉండటంవల్ల ఆ బాలికలందరూ ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. ఇప్పటికే రెండు అంతస్తులో ఉన్న ఈ స్కూలు భవనం మరో రెండు అంతస్తులను భరించడానికి ఎంతమాత్రం బలంగా లేదు. పునాదులు బలహీనంగా ఉన్న కారణంగా స్కూలు భవనం కుప్పకూలిపోయింది.

## డి.ఆర్.కాంగో మాజీ అధ్యక్షుడు జోసెఫ్ కబిలకు ఉరిశిక్ష



కిన్షాసా: ఆఫ్రికా దేశం డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో మాజీ అధ్యక్షుడు జోసెఫ్ కబిల (55)కు ఆ దేశ మిలిటరీ కోర్టు ఉరిశిక్ష విధించింది. ఆయనను న్యాయస్థానం దేశద్రోహిగా ప్రకటించింది. ఐతే ఆయన ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఆయన లేకుండానే మిలిటరీ కోర్టు ఆయనపై ప్రాసిక్యూషన్ మోసిన అభియోగాలను విచారించి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 2001 జనవరి 17 నుండి 2019 జనవరి 24 వరకూ ఆయన దేశాధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. తండ్రి లారెంట్ డిజైర్ కబిల హత్యకు గురైన పది రోజుల తర్వాత కాంగో నాలుగో అధ్యక్షుడుగా ఆయన బాధ్యతలు చేపట్టి 19 సంవత్సరాలు దేశాన్ని పాలించారు. తూర్పు కాంగో ప్రాంతంలో పోరుగుదేశం రువాండా సహాయంతో తిరుగుబాటుదారులు బీభత్సం సృష్టించినప్పటికీ మిగిలిన దేశాన్ని స్థిరంగా శాంతియుతంగా పాలించిన ఘటన ఆయనకే దక్కింది. 2011లో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అతి దారుణమైన అవినీతికి పాల్పడ్డారని, మానవ హక్కులను ఉల్లంఘించారని ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. 2016లో ఆయన దేశంలో ఎన్నికలు జరపలేదు. తీవ్ర ఒత్తిడిమధ్య 2018లో ఆయన ఒక ప్రకటన చేస్తూ మూడోసారి దేశాధ్యక్ష పదవికి పోటీ చేయడంలేదని ప్రకటించారు. తర్వాత శాంతియుతంగా మరొకరికి అధికారం బదలాయించారు. ఆయన 138 మిలియన్ డాలర్ల అవినీతిపై 2021లో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.2023లో ఆయన దేశం నుండి అదృశ్యమయ్యారు. ఇప్పటివరకూ కబిల ఎక్కడ ఉన్నారో జాడ తెలియదు.

## సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో భూకంపం



● కుప్పకూలిన భవంతులు : 69 మంది మృతి ● శిథిలాల్లో చిక్కుకున్న పౌరులు

**మనీలా:** ఇటీవల భారీ తుఫాను,వరదలతో అతలాకుతలమైన ఫిలిప్పీన్స్ తీవ్ర భూకంపం బారిన పడింది. బుధవారం సాయంత్రానికి తెలిసిన సమాచారం ప్రకారం ఈ భూకంపంలో 69 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఇంకా అనేకమంది శిథిలాల్లో చిక్కుకున్నారు. సహాయబృందాలు వారిని వెలికితీసేందుకు ఎంతగానో శ్రమపడుతున్నాయి. భారీ యంత్రాలను బోగో నగరానికి తరలించారు. భూగర్భంలో చాలా తక్కువ లోతులో భూకంప కేంద్రం ఉండటంవల్ల భూమి తీవ్రంగా కంపించింది. కొండచరియలు విరిగిపడ్డాయి. ఉపరితల భూమి రెండుగా చీలిపోయి చాలా లోతుకు బీటలువారింది. శతాబ్దాలనాటి చర్చ్‌లు, ప్రభుత్వ భవానాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదే సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో అతి శక్తిమంతమైన 'బులోయ్' పెను తుఫాను ఇటీవల దేశాన్ని అతలాకుతలం చేసింది. ఈ తుఫానువల్ల 27 మంది మరణించారు. ఈ కష్టకాలంలో అమెరికా,భారత్, ఆస్ట్రేలియా, జపాన్,యూరోపియన్ యూనియన్ సహా పలు దేశాల నాయకులు,దౌత్యవేత్తలు ఫిలిప్పీన్స్‌కు సంఘీభావం ప్రకటించారు. శిథిలాల్లో సజీవంగా ఉన్న పౌరులను కాపాడేందుకు ఇంకా కొంత గడువు ఉందని, ఈ గోల్డెల్ అవర్స్‌లో వారిని కాపాడాలని స్థానిక పురపాలక ప్రధానాధికారి ఫెర్నార్డో రఫాయిలిటో అలెజాండ్రో చెప్పారు. సెంట్రల్ ఫిలిప్పీన్స్ తీరప్రాంతంలో మంగళవారం రాత్రి పది గంటల సమయంలో సంభవించిన భూకంపంలో పలు భవనాలు కుప్పకూలాయి. జాతీయ రహదారులు రెండుగా చీలిపోయి పొడవాటి గుంటలు ఏర్పడ్డాయి. బోగో సిటీ, సెబూ ప్రాంతాలలో ఎక్కువ నష్టం వాటిల్లిం ది. సెబూ ప్రాంతాన్ని అత్యవసరంగా 'స్టేట్ ఆఫ్ కేలమిటీ'గా ప్రకటించారు. వైద్యులు,నర్సులు, ఇతర సహాయ సిబ్బందిని సెబూ ప్రాంతానికి తరలిరావాలని ప్రభుత్వం ఆదేశించింది. బోగో నగరంలో 90,000 మంది భూ కంపం బారినపడ్డారు. తరిచ్‌టర్ స్కేలుపై భూకంపం 6.9 తీవ్రతగా నమోదైంది. సముద్ర తరంగాలవల్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానిక భూభౌతికవిభా గం అధికారులు తొలుత ప్రాథమిక హెచ్చరికలు జారీ చేశారు. సెంట్రల్ ఐలాండ్స్‌లోని లేయ్టే, సెబు, బినిరన్ ప్రాంత నివాసితులను అధికారులు అప్రమత్తం చేశారు. పసిఫిక్ బేసిన్ చుట్టూ అగ్నిపర్వతాలు ఎన్నో ఉన్నాయి. ఈ పసిఫిక్ బేసిన్‌లో వేలాది దీవులు ఉన్నాయి. ఈ దీవులలో జపాన్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా సహా అనేక దేశా లు విస్తరించి ఉన్నాయి. అందువల్ల ఈ అగ్నిపర్వతాలు ఈ ప్రాంత భూగర్భంలో కల్లోలానికి గురవుతూ ఉంటా యి. ఫిలిప్పీన్స్‌లో తాజాగా సంభవించిన భూకంపం బో గో నగరానికి ఈశాన్యంగా 12 మైళ్ళ అతి తక్కువ లోతులో నే సంభవించడంవల్ల జనావాసాలకు తీవ్ర నష్టం కలిగింది.

### ప్రధానమంత్రి మోదీ సంతాపం

ఫిలిప్పీన్స్‌లో భూకంప ప్రమాదంపట్ల భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తీవ్ర సంతాపం ప్రకటించారు. మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారికోసం దేశం ప్రార్థనలు చేస్తుందన్నారు. ఈ కష్టకాలంలో ఫిలిప్పీన్స్‌కు భారతదేశం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. ''భూకంపంవల్ల తీవ్ర నష్టం సంభవించి అనేక మంది ప్రజలు మరణించారన్న వార్త విని నేనెంతో ఆవేదన చెందాను, మృతులకు కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను, గాయపడినవారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా, ఈ కష్టకాలంలో భారతదేశం తోడుగా ఉంటుంది'' అని మోదీ పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్‌లో ఉన్న అమెరికా దౌత్యవేత్త మేరీకే కార్ల్‌సన్ ఎక్స్ వేదికగా ప్రకటన చేస్తూ సంఘీభావం ప్రకటించారు. విదేశాల సహాయం ఆశించాలా? వద్దా? అని ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రమాద తీవ్రతను అంచనావేస్తోంది.

## షట్‌డౌన్‌లోకి వెళ్ళిన అమెరికా

అన్‌పెయిడ్ లీవులో లక్షలమంది ఉద్యోగులు



**వాషింగ్టన్:** అమెరికా కాంగ్రెస్ రెండు కీలక బిల్లులను గడుపులోపు ఆమోదించడంలో విఫలం కావడంతో ఆరు సంవత్సరాల తర్వాత మళ్ళీ మొదటిసారి ఆ దేశం షట్‌డౌన్‌లోకి వెళ్ళింది. అంటే దేశంలో ఉద్యోగులకు వేతనాల చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు మాత్రమే విధుల్లో ఉంటారు. కానీ వీరికి కూడా వేతనాలు ఉండవు. బిల్లులు ఆమోదం పొందాకే ఈ బకాయిలన్నీ చెల్లిస్లారు. మిగతా ఉద్యోగులంతా వేతనాలు లేకుండా సెలవుల్లో ఉండాలి. ప్రభుత్వం దృష్టిలో అత్యవసరంకాని మిగిలిన సేవలు అన్నీ తాత్కాలికంగా స్తంభించిపోయాయి. కానీ ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు. సుమారు 7.50 లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు అన్‌పెయిడ్ లీవులోకి వెళ్ళారన్నది ప్రాథమిక అంచనా. బిల్లులు ఆమోదం పొందకపోవడానికి మీరంటే మీరే కారణమని డెమోక్రాట్లు, రిపబ్లికన్లు పరస్పరం విమర్శించుకుంటున్నారు. బిల్లు ఆమోదం పొందాలంటే 100 మంది సెనేటర్లలో కనీసం 60 మంది అనుకూలంగా ఓటు వేయాలి. అత్యవసరం కాని మిగిలిన లక్షలాదిమంది ఉద్యోగులు ఎలాంటి వేతన చెల్లింపులు లేకుండా సెలవులపై వెళ్ళి ఇళ్ళల్లోనే కూర్చోవాలి. ఈ బిల్లులు ఆమోదం పొందిన తర్వాతనే తిరిగి వారికి వేతనాలు చెల్లిస్తారు. బిల్లుల ఆమోదం తర్వాతే ఉద్యోగులు అన్‌పెయిడ్ సెలవులు రద్దుచేసుకుని విధుల్లోకి వెళ్ళాల్సి ఉంటుంది. 2018లో ఒకసారి అమెరికా ప్రభుత్వం ఈ విధంగా షట్‌డౌన్‌లోకి వెళ్ళింది. ఇప్పుడు మళ్ళీ ట్రంప్ హయాంలో అదే పరిస్థితి వచ్చింది. సెనేటర్లు చివరి నిమిషంలో రెండు ఫండింగ్ బిల్లులను ఆమోదించే విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఈలోపు అర్ధరాత్రి గడువు ముగిసిపోవడంతో షట్‌డౌన్ ప్రారంభమైంది. అంటే భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30 గంటలకు ఈ షట్‌డౌన్‌తో అత్యవసరంలేని కార్యాలయాల మూసివేత మొదలైంది. 1981 నుండీ ఇప్పటివరకూ అమెరికా ప్రభుత్వం 15 సార్లు షట్‌డౌన్ అయ్యింది. ఇందులో 2018లోనే చాలా ఎక్కువగా జనవరి,ఫిబ్రవరి, డిసెంబరు నెలల్లో మూడు సార్లు షట్‌డౌన్ అయ్యింది. 1982లో రెండుసార్లు, 1984లో రెండుసార్లు, 1995లో రెండుసార్లు ఇదేవిధంగా షట్‌డౌన్ అయ్యింది. 2018 డిసెంబరు మొదలైన షట్‌డౌన్ అత్యధికంగా 35 రోజులపాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఆ తర్వాత 1995 డిసెంబరులో 21 రోజులపాటు షట్‌డౌన్ కొనసాగింది. 2023 సెప్టెంబరులో 16 రోజులు షట్‌డౌన్ అయ్యింది. మిగిలినసమయాల్లో జరిగిన షట్‌డౌన్లు కేవలం ఐదురోజుల వ్యవధిలోలపే ముగిశాయి. ప్రభుత్వ సేవలు స్తంభించి పోవాలని తాను గానీ, రిపబ్లికన్‌పార్టీగానీ కోరుకోవడంలేదని డోనాల్డ్ ట్రంప్ మంగళవారం వైట్‌హౌస్‌లో ప్రకటించారు. షట్‌డౌన్ అవసరం లేదని, కానీ అలాంటి పరిస్థితి వచ్చేట్టు కనిపిస్తోందని, నిజంగా షట్‌డౌన్ అంటూ జరిగితే తాను ఇక వెనక్కు తీసుకోవడానికి అవకాశం లేకుండా తీవ్రమైన కోతలు విధిస్తానని కూడా హెచ్చరిక చేశారు. ఇదంతా డెమోక్రాట్స్‌వల్లే జరుగుతోందని ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డెమోక్రాట్లు–రిపబ్లికన్లు ఒకరితో ఒకరు మాట్లాడుకుని సమస్య పరిష్కారం కోసం కృషి చేయడంలేదని, ఒకరినొకరు విమర్శించుకుంటున్నారని వైట్‌హౌస్‌లో జర్నలిస్టులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. మరోవైపు అనేకమంది ఉద్యోగులు స్వచ్ఛందంగా వేతనాలు లేకుండా ఉద్యోగాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ''ఈ షట్‌డౌన్ సమయంలో నేను వేతనం లేకుండా ఉచితంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తా'' అని ఫైర్ ఫైటర్ విలియం క్రైడ్జ్ వ్యాఖ్యానించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఏడాదికాలం ఎంతో సంతృప్తినిచ్చింది

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటై ఏడాది పూర్తికావడం, ఈ కాలంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా కమిషన్ అనేక కీలక నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించడం వాటిని పరిగణలోకి తీసుకుని అమలు చేసేందుకు పూనుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షం లో ఉన్నప్పుడే అధికారంలోకి వస్తే.. తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలుపుకుందన్నారు. కమిషన్ ఏర్పాటు అయిన వెంటనే రైతులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు చాలా జాగ్రతగా ఆలోచన చేసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తమ దృష్టికి వచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటి పరిష్కారానికి సైతం చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో ప్రధానంగా విత్తనో త్పత్తి రైతులను మోసం చేసిన విత్తన కంపెనీల నుంచి ఆ రైతులకు నష్ట పరిహారం అందేలా చేయడంతో పాటు శాశ్వతంగా ఇలాంటి సమస్యల పరిష్కారానికి గాను విత్తనం చట్టం అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఇందుకు ప్రభుత్వం సైతం వెంటనే బిల్లు ముసాయిదా రూపకల్పనకు కమిటీ ఏర్పాటు చేసిందని కోదండరెడ్డి గుర్తు చేశారు.

## టివివిపి ఆసుపత్రుల్లో కార్మికుల సంఖ్యను తగ్గిస్తే సమ్మెకు వెనకాడబోం



ఎఐటియుసి హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్ : టివివిపి ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలు తగ్గించి విడుదల చేయడం అన్యాయమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహాలు అన్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారులు కాంట్రాక్టర్లు కలిసి కార్మికుల వేతనాలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇదే జరిగితే సమ్మెకు సైతం వెనకడబోమని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారంటివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు ఎండి యూసుఫ్, నరసింహాలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం టెండర్ పిలిసి కార్మికులను డ్యూటీలు చేయించుకోవడం జరుగుతున్నదని టెండర్ కాల పరిమితి ముగిసిన నేటికీ అదే టెండర్లతో ప్రభుత్వం పనులు చేయించుకుంటుదన్నారు. కాంట్రాక్టర్లు నాటి నుండి నేటి వరకు కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తున్నారని, తక్షణమే కొత్త టెండర్లను పిలవడంతో పాటు కార్మికుల వేతనాలను రూ.26 వేలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే సమ్మెకు సైతం వెనకబోమని వారు కమిషనర్‌కు వివరించారు. అదేవిధంగా ఎక్కడైనా కార్మికుల సంఖ్యను తగ్గించాల్సి వస్తే మూడు నెలల ముందు సమాచారం నోటీసు రూపంలో ఇవ్వాలని అలాంటిది పాటించకుండా ఆరు నెలలు పనులు చేయించుకుని ప్రస్తుతం జీతాలు ఎగ్గొట్టేందుకు అధికారులు, కాంట్రాక్టర్లు ప్రయత్నించడం తీవ్ర అక్షేపనీయమన్నారు. ఇప్పటికే ఆసుపత్రుల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా భావించాల్సి వస్తున్నదని వారు పేర్కొన్నారు.

**టీవి విపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ వివరణ**

ఈ అంశంపై టీవి విపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు రికనబల్ బెడ్ స్ట్రెంత్‌ను పంపించడం జరిగిందని తద్వార్ల బెడ్ల సంఖ్యను తగ్గించినందువలన కార్మికులను తగ్గించాల్సి వస్తుందని వివరణ ఇచ్చారు. మరొక మారి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లతో మాట్లాడి బెడ్ల సంఖ్యను పెంచి కార్మికులను తగ్గించకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తామని ఆయన యూనియన్ నాయకులకు హామి ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు కమిషనర్ కార్యాలయానికి రికనబుల్ బెడ్‌స్ట్రెంత్‌ను మరొకసారి లెక్కించి అందజేయాల్సిందిగా కోరుతామన్నారు.

## గాజా స్వాధీనానికి ట్రంప్, నెతన్యాహుల కుట్రలు ఫలించవు

వి.ఎస్.బోస్



ప్రజాపక్షం/హైదరాబాద్ : హమాస్ సంస్థ చర్యలను అడ్డుపెట్టుకొని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ నేత నెతన్యాహుతో కలిసి గాజాను స్వాధీనం చేసుకోవాలనే కుట్రలను ప్రపంచంలోని అభ్యుదయవాదులు ఖండించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. ట్రంప్ ప్రకటించిన 20 అంశాలలో పాలస్తీనా దేశ సమస్య లేదని, నెతన్యాహు స్వతంత్ర పాలస్తీనాకు వ్యతిరేకిస్తున్నాని ట్రంప్ సమక్షంలో చెప్పటంతో దాగివున్న కుట్ర తెలుస్తుందన్నారు. హమాస్ బంధించిన ఇజ్రాయిల్ పౌరులను విడుదల చేయమని అడగటం సమంజసమైన ప్రతిపాదన కానీ, వారు కోరుకుంటున్న పాలస్తీనాకు పరిష్కారం చూపించకుండా ట్రంప్ ఏలాంటి ప్రతిపాదన చేసినా అది ఫలవంతం కాదన్నారు. గాజాను అమెరికా ఆధీనంలోకి తీసుకోవటం, హమాస్ నాయకులను ఓపెన్ జైలులో ఉంచినట్లుగా ట్రంప్ చేసిన ప్రతిపాదనలో అసలు విషయమన్నారు. ప్రపంచ ప్రజలు ఈ దుర్మార్గపు ఆలోచనను సహించబోరని, పాలస్తీనా ప్రజలకు స్వతంత్ర దేశం కావాలని ఆకాంక్షను ప్రజ లు, ఐక్యరాజ్య సమితి ముక్తకంఠంతో బలపరుస్తోందన్నారు. తక్షణమే ట్రంప్, నెతన్యాహు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ కుట్రలు మానుకొని నిజమైన శాంతి కోసం ప్రయత్నించాలని లేకపోతే చరిత్రలో నియంతలకు పట్టిన గతే వీరికి పడుతుందని బోస్ హెచ్చరించారు.

## తగ్గిన రైతు ఆత్మహత్యలు..

2014లో 1347...2023లో 56 మంది : హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 2014లో 1347 రైతు ఆత్మహత్యలు నమోదవ్వగా, ఆ సంఖ్య 2023 నాటికి 56కు తగ్గిందని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 2023లో దేశవ్యాప్తంగా 10,786 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా ఇందులో తెలంగాణ వాటా కేవలం 0.51 శాతంగా ఉన్నదన్నారు. జాతీయ నేర గణాంక నివేదిక (ఎన్ఆర్‌సిబి )లెక్కలు కాంగ్రెస్ నాయకులకు చెంపపెట్టులాంటిదని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014లో రైతు ఆత్మహత్యలల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం నేడు 14వ స్థానికి పరిమితమైందని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు స్థాయిలో 95.84% తగ్గిందని వివరించారు. స్వరాష్ట్రంలో ఒక్కో పథకంతో వ్యవసాయరంగానికి జీవం పోశారని, సాగును బాగు చేశారని, రుణమాఫీతో రైతన్నకు ధీమా దొరికిందని, 'రైతు బంధు' రైతులకు బంధువుగా మారిందని, రైతు బీమా కొండంత భరోసాను ఇచ్చిందని వివరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిపిఐ(ఎం) సన్నద్ధం : జాన్ వెస్లీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తామకు బలంగా ఉన్న ప్రాంతాల్లో పోటీకి సన్నద్ధం అవుతున్నట్లు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో సర్దుబాటు, కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై ఈనెల 4వ తేదీన జరగనున్న పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని ఓడిరచడమే తమ రాజకీయ కర్తవ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు బిజెపి అడ్డుపడిందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను, యూరియాను ఇవ్వడం లేదని చెప్పారు.

**ఏజెన్సీ ప్రాంత జెడ్పీ చైర్మన్ స్థానాలు ఎస్‌టిలకే కేటాయించాలి**

స్థానికసంస్థల ఎన్నికల్లో ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు రిజర్వేషన్ అమలు చేయొద్దంటూ నిబంధనలున్నాయని, గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మెన్ స్థానాలకు ఎస్‌టిలకే రిజర్వేషన్ ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జిల్లా పరిషత్ రిజర్వేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అన్నారు. ఆదివాసీలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్ జెడ్పీ చైర్మెన్ స్థానాలను జనరల్ స్థానాలుగా ప్రకటించడం సరైంది కాదని చెప్పారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న జెడ్పీ చైర్మెన్ స్థానాలను ఎస్టీ రిజర్వేషన్ కొనసాగించేలా ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

డిజిపిగా బాధ్యతలు స్వీకరణ

లొంగిపోయిన మావోయిస్టులకు వేధింపులు ఉండవని పిలుపు





ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతారణంలో సజావుగా నిర్వహిస్తామని డిజిపి బి.శివధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయంలో బుధవారం ఆయన డిజిపిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల తమకు ఛాలెంజ్‌గా నిలిచాయన్నారు. ప్రస్తుతం తమ దృష్టి ఈ ఎన్నికలపైనే కేంద్రీకరించామని అందుకు సంబంధించిన బందోబస్తుతో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తనకు డిజిపిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం ముందున్న బాధ్యత అని అన్నారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని సూచించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఎలాంటి వేధింపులు ఉండవని, అన్ని రకాలుగా అండగా ఉంటామని అన్నారు. పోరాట మార్గం వీడేందుకు సిద్ధంగా ఉన్నామని ఇటీవల మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడే లేఖ రాశారని తెలిపారు. రష్యా, చైనాలో ఉన్న పరిస్థితులు భారత దేశంలో ఉన్న పరిస్థితులు వేరని వాటిని ఇన్నాళ్లు గుడ్డిగా అవలంభించామని ఇక పోరాటాన్ని ఆపేస్తామని అందులో పేర్కొన్నారని అన్నారు. అందువల్ల మావోయిస్టు సిద్ధాంతాలు ఆచరణలో విఫలం అయ్యాయని తాము భావిస్తున్నామన్నారు. ఇకనైనా మావోయిస్టులు అజ్ఞాతం వీడి ప్రజల్లోకి రావాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇటీవల కేంద్ర కమిటీ సభ్యురాలుగా ఉన్న సుజాత కూడా లొంగిపోయిన విషయం గుర్తు చేశారు. రాష్ట్రంలో మావోల ప్రభావం లేదని వాళ్లతో ఇంకా చర్చలు జరపాల్సిన అవసరం ఏ ఉందని తెలిపారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కొంత మావోల అలికిడి ఉందని రాష్ట్రంలోకి ప్రవేశించడం లేదని తెలిపారు. ఛత్తీస్గడ రాష్ట్రాలకు చెందిన మావోయిస్ట్ సానుభూతి పరులు మన దగ్గర లొంగిపోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో స్వాతిలక్రా, అదనపు డిజిపి మహేష్‌కుమార్ భగవత్, సీనియర్ ఐపిఎస్ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, విసి సజ్జనార్, సుధీర్‌బాబు, అవినాష్ మహంతి, సుమతి, తఫ్సీర్ ఎక్బాల్, రమేష్‌రెడ్డి, చారుసిన్హా, చింతమనేని శ్రీనివాస్, వివి శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు పాల్గొన్నారు.

**శివధర్‌రెడ్డి నేపథ్యం..**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పెద్దతుండ్ల గ్రామంలో జన్మించిన బి.శివధర్‌రెడ్డి 1994లో ఐపిఎస్‌గా ఎంపికయ్యారు. ఆ తరువాత అదనపు ఎస్‌పిగా విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి, నర్సిపట్నం, చింతపల్లి, గ్రేహ్యౌండ్స్, బెల్లంపల్లిలో పనిచేశారు. ఎస్‌పిగా నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు, హైదరాబాద్ ట్రాఫిక్, సౌత్‌జోన్, ఎస్ఐబిలో విధులు నిర్వహించారు. డిఐజిగా ఎస్ఐబి, ఎసిబిలో, ఐజిపిగా పదోన్నతి పొందిన తరువాత ఎసిబి, విశాఖపట్నం కమిషనర్‌గా, ఐపిజి పర్సనల్, అదనపు డిజిపి హోదాలో రైల్వే, రోడ్డు సేఫ్టీ, ఇంటెలిజెన్స్, డిజిగా ఇంటెలిజెన్స్ పనిచేసిన ఆయన ప్రస్తుతం డిజిపిగా పనిచేస్తున్నారు. 2002లో ఆయనకు గ్యాలంటరీ అవార్డు, 2003లో అంతరిక్ సురక్షా సేవా పతకం, యూనైటెడ్ నేషన్స్ పోలీసు మెడల్, 2011లో ఐపిఎం మెడల్, 2018లో అసాధరణ ఆసుచన కుషాల్తా పదక్, 2021లో ఎటిఐ ఉత్రిక్షిత్ పదక్ సాధించారు.

**గవర్నర్, సిఎం, సిఎస్‌లను కలిసిన డిజిపి**

తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా భాదత్యలు చేపట్టిన బి.శివధర్ రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌ను వెళ్లి మర్యాదపూర్వకంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. ఆ తరువాత బంజారాహిల్స్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా సిఎం ఆయన్ని అభినందించారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుతో పాటు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డిజి రవిగుప్తాను వేరు వేరుగా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# బిసిలకు ఈటల రాజేందర్, బిజెపి క్షమాపణ చెప్పాలి

రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తారా? లేదా? : కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లవద్దని, ఒక వేళ ఫలితాలు వచ్చినా, న్యాయస్థానాన్ని ఆశ్రయించి వాటిని రద్దు చేయిస్తామని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించడం దుర్మార్గమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దుయ్యబట్టారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసిలు గెలువడం బిజెపికి, ఈటల రాజేందర్‌కు ఇష్టం లేదా? అని నిలదీశారు. బిసిలను బ్లాక్ మెయిలింగ్ చేసే పద్ధతిలో మాట్లాడిన ఈటల రాజేందర్, బిజెపి వెంటనే బిసిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి రిజర్వేషన్ల బిల్లులను ఆమోదిస్తారా?, లేదా స్పష్టం చేయాలని ఆమె బిజెపిని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్, బిజెపి ఏమైనా న్యాయస్థానాలా? లేదా వారే జడ్జీలా అని ప్రశ్నించారు. బిల్లును ఆమోదించి, రిజర్వేషన్లను ఇవ్వాల్సిన కేంద్రంలో అధికార బిజెపినే కోర్టుకు వెళ్లి ఎన్నికను రద్దు చేయిస్తామనడం ద్రోహపూరితమన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిసి రిజర్వేషన్ల జిఒను స్వాగతిస్తే, ఈటల మాత్రం భిన్నంగా మాట్లాడుతారని, బిసి రిజర్వేషన్లపైన ఆ పార్టీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది ఎంపిలు ఢిల్లీలోని ప్రధాని మోదీ కాళ్లు పట్టుకోని రిజర్వేషన్లు అమలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ల ప్రక్రియ తప్పులతడకకగా ఉన్నదని, ఎస్‌సిలు, ఎస్‌టిలు లేని వద్ద ఎస్‌సిలకు, ఎస్‌టిలకు రిజర్వేషన్లను కేటాయించారని, మరోవైపు ఎస్‌సి వర్గీకరణ స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో కనిపించలేదని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మరోను పల్లిని ఎస్‌టి రిజర్వేషన్ కేటాయించారని, గతంలో కూడా ఈ గ్రామాన్ని ఎస్‌టిగా కేటాయించినప్పటికీ ఆ గ్రామంలో ఎస్‌టిలు లేకపోవడంతో సర్పంచ్ ఎన్నికలు జరగలేదని, ఈసారి కూడా ఎస్‌టి రిజర్వేషన్‌ను కేటాయించారని కవిత గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపిపైన ఒత్తిడి తీసుకొచ్చి బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించే విధంగా పోరాటం చేయాలని, ఆ తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చును కదా అని కవిత ప్రశ్నించారు.ఈ నెల 8న కోర్టు తీర్పు వచ్చిన తర్వాత తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. బిఆర్ఎస్‌కు, తనకు ఇచ్చిపుచ్చుకునేది ఏమీ లేదని, (లేన్‌దేన్) హామీలపైన పోరాటం చేస్తున్న బిఆర్ఎస్, బిసిల అంశాన్ని కూడా ప్రస్తావించాలని కవిత సూచించారు.

## బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగం అన్ని అంశాలలో బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. బిసిలు తమ హక్కుల సాధన కోసం అంత ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కామారెడ్డి బహిరంగ సభలో ఇచ్చిన హామీని సిఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. బిసిలను కొంతమంది నాయకులు అడ్డుకుంటున్నారని, కోర్టులో పిటీషన్ దాఖలు చేశారన్నారు. అసెంబ్లీలో బిసి బిల్లును బిజెపి, బిఆర్ఎస్ మద్దతు తెలుపుతాయని, బయట ధర్నాలు చేస్తాయన్నారు. ఈనెల 8న హైకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో అందరూ కూడా బయటకు రావాలని, 42 శాతం రిజర్వేషన్ల కోసం బిసిలు బయటకు రాకపోతే భవిష్యత్తు లో ఇలాంటి అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావని హనుమంతరావు తెలిపారు.

# నేడు, రేపు తెలంగాణలో భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరింత బలపడి పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ, గురువారం తెల్లవారుజామున వాయుగుండంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 3న దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాల మధ్య తీరం దాటుతుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం, శుక్రవారం, శనివారం, ఆదివారం తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరించారు. ఆదిలాబాద్, కుమ్రం భీంఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

### హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్ నగరంలో బుధవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు. జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, సోమాజిగూడ, ఖైరతాబాద్, బేగంపేట్, పంజాగుట్ట, కొండాపూర్, మాదాపూర్, మెహిదీపట్నం, బషీర్ బాగ్, అబిడ్స్, కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లక్డీకాపూల్, బాగ్ అంబర్ పేట్, కాచిగూడ, నల్లకుంట, బర్కత్‌పురా, ముషీరాబాద్, విద్యానగర్, రాంనగర్, ఉస్మానియా యూనివర్సిటీ, బాగ్ లింగంపల్లి, చిక్కడపల్లి, ఆర్‌టిసి క్రాస్ రోడ్ గాంధీ నగర్, జవహర్ నగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, చంపాపేట్, మలక్‌పేట్, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో వర్షం కురిసింది.

## సిఎం దసరా శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారని అన్నారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలయ్ బలయ్ తీసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని సిఎం గుర్తు చేశారు. తెలంగాణ అప్రతిహత విజయాలతో అభివృద్ధి సాధించాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలతో ఈ పండుగ జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆ దుర్గామాతను ప్రార్థించారని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది.

## కెసిఆర్ విజయదశమి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: కార్యదీక్షులను అపజయాల నుంచి విజయాల దిశగా నడిపిస్తూ, ఏనాటికైనా ధర్మానిదే అసలు విజయం అనే స్ఫూర్తిని 'దసరా పండుగ' మనకు అందిస్తుందని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. దసరా పండుగ (అక్టోబర్ 2) సందర్భంగా, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ విశిష్టతను గౌరవిస్తూ, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో బతుకమ్మతో పాటు విజయదశమి స్ఫూర్తి ఇమిడి ఉన్నదని, అదే స్ఫూర్తితో పదేళ్ల పాలనలో ప్రజలను ప్రగతి విజయాల దిశగా నడిపించామని కెసిఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలని ఆకాంక్షించారు. తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని, నిత్య శుభాలతో ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా దీవించాలని దుర్గా మాతను కెసిఆర్ ప్రార్థించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబురాలతో పాటు, దేవీ శరన్నవరాత్రుల దుర్గమ్మ పూజల పర్వదినాలకు కొనసాగింపుగా.. విజయ దశమిగా జరుపుకునే దసరా పండుగకు తెలంగాణ ప్రజా జీవనంలో ప్రత్యేక స్థానం ఉన్నదని అన్నారు.

## ధర్మం గెలిచిన రోజు : టిపిసిసి చీఫ్

విజయదశమి పండుగ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అధర్మంపై ధర్మం గెలిచిన రోజుగా దసరా ప్రత్యేకతను కలిగివుందని ఆయన పేర్కొన్నారు. విజయదశమి పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం నింపాలని, సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించాలని, అభివృద్ధి, ఆరోగ్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు.

## కాంగ్రెస్‌ది.. సర్కస్: కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇది కాంగ్రెస్ సర్కారు కాదని,సర్కస్ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు ఎద్దేవా చేశారు. సొంత పార్టీ ఎంఎల్‌ఎలే రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్మడం లేదని ఆయన తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతులేని అరాచకత్వం, అపరిమితమైన అజ్ఞానం రాజ్యమేలుతున్నదన్నారు. తన నియోజకవర్గంలో వరదలు వస్తే ప్రజలకు సహాయం చేయాలని ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ఎంఎల్‌ఏ ఎల్లారెడ్డి ఉత్తరం రాశారని, పరిశ్రమనే తగలబెడతానని బెదిరించి జడ్చర్ల కాంగ్రెస్ ఎంఎల్‌ఏ రౌడీయిజం చేస్తున్నారని ఆరోపించారు.

# గెలిచే యత్నం

(మూడవ పేజీ తరువాయి)



తెలిపారు. ముగింపు ఉత్సవాల నిర్వహణ ఆహ్వాన కమిటీ సమావేశం అక్టోబర్ 5వ తేదీన ఖమ్మంలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల సిపిఐ కార్యదర్శులు కూడా పాల్గొనున్నారని పల్లా వెంకట రెడ్డి చెప్పారు.

**బిజెపిది లూటీకోర్ ప్రభుత్వం : డాక్టర్ నారాయణ**

దేశంలోని కొంతమంది కార్పొరేట్ ఆర్థిక నేరగాళ్లు రూ.16 లక్షల కోట్ల దేశ సంపదను కొల్లగొట్టి విదేశాలకు పారిపోతే, కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి ప్రభుత్వం గడిచిన పదేళ్లలో జిఎస్‌టి పేరుతో రూ.15 లక్షల ప్రజల ధనాన్ని లూటీ చేసిందని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. అదే బిజెపి నాయకులు ఇప్పుడు జిఎస్‌టి తగ్గింపు పేరుతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేల అదా చేస్తున్నామని నీతులు చెబుతున్నారని, బిహార్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఈ నాటకాలని ఆయన విమర్శించారు. బిహార్‌లో బిజెపిని ఓడించేందుకు ఇండియా కూటమి సర్వశక్తులను ఒడ్డనుందని చెప్పారు. లద్దాఖ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నేర్చాలని, ప్రజల అసంతృప్తిని చల్లర్చాకపోతే వారి అగ్రహాన్ని చవిచూడాల్సివస్తుందని డాక్టర్ నారాయణ కేంద్రాన్ని హెచ్చరించారు.



సమాజంలో అంతర్ భాగమైన ట్రాన్స్‌జెండర్లకు సిపిఐలో సభ్యత్వం ఇవ్వడం ద్వారా కమ్యూనిస్టు ఉద్యమంలో వారిని భాగస్వామ్యం చేయాలని సిపిఐ జాతీయ మహాసభలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్లను హోంగార్డులకు నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని పూర్తిగా స్వాగతిసున్నామని, వారికి టోల్‌గేట్ల వద్ద ఉద్యోగ అవకాశాలు కల్పించి వారు సమాజంలో గౌరవంగా బతికే అవకాశం కల్పించాలన్నారు. తమిళనాడులో బహిరంగ సభలో చోటుచేసుకున్న తొక్కిసలాటకు రాజకీయంగా, నైతికంగా టివికె అధ్యక్షులు విజయ్‌దే బాధ్యత అని, ఈ ఘటనలో చనిపోయిన వారికి విజయ్ ఒక్కొక్కరికి కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. టివికె వ్యూహాకర్త అయిన ప్రశాంత్ కిషోర్ వ్యూహంలో భాగంగానే తొక్కిసలాట చోటుచేసుకుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డాక్టర్ నారాయణ తమిళనాడు సిఎం స్టాలిన్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కళాశాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం గర్హనీయమని, ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తూ యువతను పెడదోవ పట్టిస్తున్న బిగ్‌బాస్ కార్యక్రమాన్ని నిషేధించేంత వరకు విశ్రమించబోమన్నారు.




## సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డికి సన్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్ : పంజాబ్‌లోని చండీఘార్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభల్లో సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్ రెడ్డిని జిహెచ్‌ఎంసి కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సెంట్రల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సభ్యులు ఎండి. యూసుఫ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈటి నరసింహా, యూనియన్ అధ్యక్షులు ఎం. నరసింహ, కార్యనిర్వాక అధ్యక్షులు పి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉప ప్రధాన కార్యదర్శి జి.నర్సయ్య, నాయకులు రాజేష్, పి నవీన్, రాకేష్, యు.సతీష్‌కుమార్, మధు పాల్గొన్నారు.

## మహిమగల దేవత దుర్గామాత



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవత దుర్గామాత అమ్మవారు అని, అమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌కెపురం డివిజన్ గ్రీన్‌హిల్స్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాల వేడుకల్లో మధుర ఉపేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శైలజారెడ్డి, రజనీ, రాణీ, మదరపు శైలజ, అరుణ, సరిత, వరూదిని, మహాలక్ష్మి , కృష్ణవేణి, విమల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : చెడు పై మంచి సాధించిన విజయంగా దసరా (విజయదశమి ) జరుపుతారని రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ శమీ పూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలయ్ బలాయ్ తీసుకొని, పెద్దల ఆశీర్వాదం తీసుకొని శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం మన సంస్కృతి సంప్రదాయాల్లో భాగమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

దసరా పండుగ శుభాకాంక్షలు: మంత్రులు శ్రీహరి,కొండాసురేఖ

దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను జరుపుకుంటారని వారన్నారు.జమ్మి ఆకును ఇచ్చి చిన్న పెద్ద అంతా అలాయ్ బలాయ్ తీసుకోవడం ప్రేమ ఆప్యాయతలకు మన సంస్కృతి నిదర్శనం అన్నారు. ప్రజలు అందరి జీవితాల్లో చెడు తొలిగి మంచి జరిగి సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఎన్నికలకు సిద్ధం అవుతున్న ఎంపిటిసి రిజర్వేషన్లపై అభ్యర్థుల చూపు!

ప్రజాపక్షం/షాబాద్: షాబాద్ మండలంలో 41 గ్రామ పంచాయతీలకు గాను తెలిసిన సమాచారం మేరకు ఎంపిటిసి రిజర్వేషన్ల వివరాలు.. షాబాద్ మండలంలో మొత్తం 15 ఎంపిటిసి స్థానాలుగా కెటాయించారు. నాగర్‌కుంట ఎస్‌సి జనవరల్, మద్దూర్ ఎస్‌టి జనరల్, ఎల్గొండగూడ ఎస్‌సి జనరల్, గొల్లూర్‌గూడ ఎస్‌సి మహిళ, చందనవెల్లి బిసి మహిళ, హైతాబాద్ బిసి జనరల్, కుమ్మరిగూడ బిసి మహిళ, షాబాద్1 బిసి జనరల్, షాబాద్2 జనరల్ మహిళ, కక్కులూర్ బిసి మహిళ, బోడపహాడ్ బిసి జనరల్, సర్దర్‌నగర్ జనరల్ మహిళ, ముద్దెంగూడ జనరల్, రేగడి దోస్వాడ జనరల్, తాళ్లపల్లి జనరల్‌గా రిజర్వేషన్లు వచ్చిన్నట్లు తెలుకున్న వివిధ పార్టీ నాజకీయ నాయకులు పోటీలకు సిద్ధం అవుతున్నారు. రిజర్వేషన్లు ఖరారుపై అధికారులు స్పష్టత ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని అభ్యర్థులు వ్యక్యం చేస్తున్నారు. స్థానిక ఎన్నికలను నిర్వహించే అధికారులు వెంట వెంటనే సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ

సంబురాల్లో పాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : దసరా పండుగ పురస్కరించుకుని, దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ హరిహరపురం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ పండుగను కాలనీ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ అంటే తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవానికి నిలువెట్టుగా నిలుస్తుందన్నారు. అడపడుచులు అనేక రకాల పూలతో బతుకమ్మను పేర్చి జరుపుకునే పండుగ బతుకమ్మ అన్నారు. మహిళాలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలతో అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రావు, కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, త్రిశక్తి ఆలయ ఫౌండర్ విజయ్ భాస్కర్, చైర్మన్ నారాయణరెడ్డి, విష్ణు నారాయణరెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో ప్రజలందరు భాగస్వాములు కావాలి : ఏసిపి



ప్రజాపక్షం/షాద్‌నగర్ : సమాజ సేవలో ప్రజలందరు భాగస్వాములు అయ్యేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ సూచించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రాజస్థాన్ సమాజ్ సభ్యుల ఆధ్వర్యంలో 180మంది కార్మికులకు దసరా పర్వదినం సందర్భంగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసిపి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగ దసరా కావడం.. మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలను ఇచ్చేందుకు రాజస్థాన్ సమాజ్ సభ్యులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. మున్సిపాలిటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా పెట్టేందుకు కార్మికులు ఎంతో కృషి చేస్తున్నారని, వారి శ్రమను గుర్తించి ముందుకు వచ్చి తొచిన సహాయం చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను చేపట్టేందుకు మరింత మంది సభ్యులు ముందుకు వచ్చేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవ చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ విజయ్‌కుమార్, కమీషనర్ సునీతలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజస్థానీ సేవా సంఘ్ అధ్యక్షుడు కైలాస్ చౌదరి, రాదేశ్యామ్ గోర్, కమల్ కిశోర్ శర్మ, రమేష్ చంద్ర అగర్వాల్, సంఘన్‌చంద్, భవాన్‌లాల్, సర్ధార్ రాజేందర్, రాజస్థానీ సంఘ్ మహిళా అధ్యక్షురాలు సుందర్ బాయ్, యువకులు రాజు చౌదరి, గజేందర్ గోరీ, మనీష్‌గోర్, పవన్‌కుమార్‌తోపాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో మార్పు లేదు

స్పష్టం చేసిన జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో ఎలాంటి మార్పు లేదని మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ప్రాజెక్ట్స్ విభాగం బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ఫ్లైఓవర్‌కు నామకరణం విషయంలో మార్పులు జరిగాయనే ఊహాగానాలను ఈ ప్రకటనతో జిహెచ్‌ఎంసి తోసిపుచ్చింది. జిహెచ్‌ఎంసి స్థాయిసంఘం ఇప్పటికే ఈ ఫ్లైఓవర్‌కు 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా నామకరణం చేస్తూ ఆమోదం తెలిపిందని ప్రాజెక్ట్స్ విభాగం గుర్తు చేసింది. ప్రస్తుతం ఫ్లైఓవర్‌కు బోర్డుల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఒకవైపు బోర్డు ఏర్పాటు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రెండోవైపు బోర్డు ఏర్పాటుకు సంబంధించిన ఫౌండేషన్ క్యూరింగ్ ప్రక్రియ జరుగుతోందని జిహెచ్‌ఎంసి అధికారులు చెప్పారు. క్యూరింగ్ పీరియడ్ పూర్తి కాగానే, రెండు రోజుల్లో రెండో వైపు బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అప్పటి వరకూ, ఇప్పటికే ఏర్పాటు చేసిన బోర్డును కప్పి ఉంచామని స్పష్టతనిచ్చారు. రెండు బోర్డుల ఏర్పాటు పూర్తయిన తర్వాత కలిపి ఒకేసారి ప్రారంభిస్తామని జిహెచ్‌ఎంసి పేర్కొంది.

## జిల్లా ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు : చల్లా నర్సింహా రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా ప్రజలకు తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయ దశమి వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతీకార్యం సఫలీకృతం కావాలని మనసారాకోరుకుంటున్నట్లు తెలిపారు.అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని,దుర్గా మాతా కరుణా కటాక్షాలతో అన్ని వర్గాల వారు సుభిక్షంగా,సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన అభిలషించారు.

# దుర్గం చెరువు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్





ప్రజాపక్షం/హైదరాబాద్ : దుర్గం చెరువును తెలంగాణలో ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడానికి చేపట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు, ఎస్‌ఎన్‌డిపి, లేక్స్ విభాగాలతో రహేజా ఐటీ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో కలిసి బుధవారం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ దుర్గం చెరువును పరిశీలించి, చెరువు ప్రొటెక్షన్ పనులతో పాటు ప్రతిపాదిత అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో పరిసర కాలనీలు ముంపు బారిన పడకుండా ఉండేందుకు చెరువు నీటి మట్టాన్ని ఎఫ్‌టిఎల్ కంటే తక్కువగా ఉంచాలని లేక్స్ విభాగానికి ఆదేశాలు ఇచ్చారు. కమిషనర్ ప్రోత్సాహంతో రహేజా ఐటీ పార్క్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా దుర్గం చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు నిధులు సమకూర్చడానికి ముందుకొచ్చింది. రెండు సంవత్సరాల పాటు చెరువును సంరక్షించడానికి ఆ సంస్థ బాధ్యత తీసుకుంది. ఇందులో భాగంగా చెరువు చుట్టూ కంచె ఏర్పాటు, నిరంతర శుభ్రపరిచే చర్యలు, నీటిమొక్కలు, తేలియాడే వ్యర్థాలను తొలగించడం, అలాగే వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం ఏర్పాటుతో ప్రజలకు సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రహేజా ప్రతినిధులను పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎస్‌ఎన్‌డిపి, లేక్స్ విభాగాలను కూడా లేక్ ప్రొటెక్షన్,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్ర పరిశీలనలో జిహెచ్‌ఎంసి కమిషనర్ వెంట జలమండలి ఈడి మయాంక్ మిట్టల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, జిహెచ్‌ఎంసి ఎస్.ఇ. శంకర్ నాయక్, రహేజా గ్రూప్ నుండి బాలరాజు, జిహెచ్‌ఎంసి ఇ.ఇ. శిరీష, సిజిఎం (ఎస్‌టిపి) పద్మజ, లేక్స్ విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీష్‌లు ఉన్నారు.

### క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పర్యవేక్షణ బలోపేతం చేయాలి

నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల అమలును ప్రభావవంతంగా ఉండేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయాలని అధికారులను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అదనపు కమిషనర్( పారిశుద్ధ్యంఆరోగ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్, జిహెచ్‌ఎంసి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పద్మజలతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనులను, అలాగే ప్రతిపాదిత నిర్మాణాత్మక పరిష్కారాలను కమిషనర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రైమరీ కలెక్షన్‌లో ఉన్న లోటుపాట్లు, జివిపి క్లియరెన్స్, అదనపు బిన్‌ల ఏర్పాటు, చెత్త సేకరణలో ఉన్న క్షేత్ర సమస్యలపై ప్రధానంగా చర్చించారు. ఈ సంలదర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా చేపట్టేందుకు అధికారులు పర్యవేక్షణను పెంచాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణ వాహనాలపై కూడా పర్యవేక్షణ ఉండాలన్నారు. హైదరాబాద్ నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత మెరుగుపడాలని, దీనికోసం అధికారులు జవాబుదారీతనం, సమయానుకూల చర్యలు, పర్యవేక్షణను పెంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో.. ఘనంగా ఆయుధ పూజ, బతుకమ్మ ఉత్సవాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ) లో ఆయుధ పూజ, బతుకమ్మ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాలేజీలోని వివిధ పరికరాలు, వాహనాలకు పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా సిబ్బంది ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ ఆయుధ పూజ ప్రాముఖ్యతను వివరించారు. మనిషి దైనందిన జీవితంలో ఉపయోగించే పరికరాలు, వాహనాల పట్ల గౌరవం, కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. కంప్యూటర్లైన, మిషన్‌లు అయినా, వాహనాలైనా, తమను, తమ కుటుంబాన్ని పోషిస్తున్న వాటిని గౌరవించి పూజిస్తేనే అభివృద్ధి, సంపదలు సిద్ధిస్తాయనే నమ్మకంతో దసర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ వస్తుందన్నారు. బతుకమ్మ ప్రకృతితో పెనవేసుకున్న పండుగ అని, తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని డాక్టర్ రామేశ్వర్ రావు అన్నారు. ఈ పండుగల సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న ప్రతి సిబ్బందికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఉత్సవాల్లో కాలేజీలోని పలు వాహనాలకు, భవనాలకు, కన్వెన్షన్ సెంటర్ భవనాలకు, సిబ్బంది వాడే కంప్యూటర్లకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ చీఫ్ కో ఆర్డినేటర్ డి. శ్రీధర్ బాబు, కాలేజ్ చీఫ్ ఎస్. లక్ష్మి కాంత రావు, డిప్యూటీ చీఫ్ డాక్టర్ పి. రాజారావు అన్ని డివిజన్లకు చెందిన హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ పాల్గొన్నారు.

## పనిముట్ల వాడకం మానవ వృద్ధిలో భాగం

జలమండలి కార్మికుల ఆయుధ పూజలు

ప్రజాపక్షం/ హైదరాబాద్ : పనిముట్ల వాడకం మానవ జీవనంలో భాగమైనందుకు ఆయుధపూజ ఆరాధన పూర్వ కాలం నుండి ఆచరించడం జరుగుతుందని ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జెఎసి చైర్మన్ మొగుళ్ళ రాజిరెడ్డి చెప్పారు. దసరా పండుగ సందర్భంగా హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జెఎసి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ నగరంలోని జలమండలి వివిధ సెక్షన్ల తోపాటు నారాయణగూడ సెక్షన్‌లో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మొగుళ్ళ రాజిరెడ్డి తోపాటు జెఎసి నేతలు రాఘవేంద్ర రాజు, ఆలీ, శ్రవణ్ కుమార్, బి.దేవేందర్, ఎం.రాజా, బి.శంకర్ ప్రకాష్, హాసిం, ఎం.రాంచేందర్, సి.రాజు, సిహెచ్. వినోద్ గౌడ్, బి.మహేష్, అశోక్, వేణు, శ్రీనివాస్, రంగయ్య, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



## ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

రాజేంద్రనగర్ బిఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



ప్రజాపక్షం/గండిపేట:మణికొండ మున్సిపల్ ప్రజల సమస్యలను ప్రశ్నిస్తే ఉద్దేశపూర్వకంగానే అక్రమ కేసులు పెడుతున్నారని రాజేంద్రనగర్ బిఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బుధవారం మణికొండ వెంకటేశ్వర కాలనీ ఉపేంద్ర నాథ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల రోజుల క్రిందట వెంకటేశ్వర కాలనీ సర్వసభ్య సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే గొడవ చేశారని అసోసియేషన్ సభ్యులకు గొడవకు ఎలాంటి సంబంధం లేదని ఉపేంద్ర నాథ్ రెడ్డి,ఆరిఫ్ పలువురిపై అక్రమ కేసులను పెట్టారని ఆయన తెలిపారు. మున్సిపాలిటీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడమేందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ప్ర భుత్వం బిఆర్‌ఎస్ పార్టీ నాయకులపై ఎన్ని కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేసిన భయపడే ప్రసక్తి లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కాలనీ అధ్యక్షుడు ఉపేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర కాలనీ 1993–94 నుండి కాలనీ ప్రజల సంక్షేమ అభివృద్ధి కొరకు పాటుపడ్డానని ఆయన పేర్కొన్నారు. కాలనీలలో రోడ్డు పనుల కోసం నిత్యం పోరాటం చేశానన్నా రు. 2018 వరకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసి వెంకటేశ్వర కాలనీ రూపురేఖలు మార్చామన్నారు. నాపై లేనిపోని ఆరోపణలు చేస్తూ గత నెల జరిగిన సర్వసభ సమావేశంలో ముందస్తు కథనం ప్రకారం దాడులు చేశారని తెలిపారు. వెంకటేశ్వర కాలనీ సర్వసభ్య సమావేశానికి మాజీ కౌన్సిలర్ పద్మరావును ఆహ్వానించలేదని పద్మారావు మాసొసైటీ సభ్యుడే కాదన్నారు. కావాల్సి మాపై దాడి చేసి అక్రమ కేసులను పెట్టారని ఆయన వ్యక్తం చేశారు. కాలనీకి ఏ ఒక్కరు కూ డా కనీసం వెయ్యి రూపాయల మెంబర్షిప్ కూడా చేయలేదని తెలిపారు. ఈ అధ్యక్షుడు సీతారామ ధూళిపాళ్ల, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా డిఎం అండ్ హెచ్‌ఒగా లలితా దేవి



ప్రజాపక్షం/రంగారెడ్డి: జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ కె.లలితా దేవి బుధవారం నూతనంగా పదవి బాధ్యతలను స్వీకరించారు.ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు పదవి విరమణ చేసిన సందర్భంగా ప్రభుత్వము హనుమకొండ జిల్లాలో ప్రోగ్రాం ఆఫీసర్ జిల్లా శిక్షణ బృందం,వైద్య అండ్ ఆరోగ్యశాఖ హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్న డాక్టర్ కె.లలితా దేవిని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిగా నియమించింది.బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలిడిఎం అండ్ హెచ్ఒ నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ కె.లలితాదేవి తన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ సకాలంలో విధులకు హాజరై తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో పనిచేస్తున్న ప్రోగ్రామ్ అధికారుల ద్వారా జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,వ్యాధి నిరోధక టీకాలు,వాటిని సరఫరా చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యా ఆరోగ్య శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని,మంచి పనితీరు కనబరచాలని కోరారు. ప్రజల ఆరోగ్యంపై ఎల్లప్పుడూ దృష్టి సారించి సమయానుకూలంగా స్పందించి సిబ్బందితో మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. ఆరోగ్య సేవలను మరింత విస్తృతపరిచి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకొని పరిసరాల పారిశుద్ధం పట్ల అవగాహన పెంపొందించి డెంగ్యూ, మలేరియా,చికెన్ గున్య వంటి వ్యాధులు రాకుండా.నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతకు ముందు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని కలిసి విధులలో చేరారు.

# దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష

మాజీ మంత్రి హరీష్‌రావు





ప్రజాపక్షం/ సిద్దిపేట : దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని మాజీ మం త్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఉత్తరతదేశంలో రైతుల పండించే గొధుమ పంటకు మద్దతు ధరకు రూ.160, దక్షిణాది రైతులు పండించే వరి పంటకు కేవలం రూ.69 పెంచటం సరికాదన్నారు. రైతుల పట్ల కేంద్ర సర్కార్ వివక్ష చూపటం సరకాదన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలసి మాట్లాడారు. గొధుమ పంటకు మద్దతు ధర క్వింటల్‌కు రూ.2585 ఇస్తే వరి పంటలకు 2369 రూపాయలు మాత్రమె చెల్లిస్తుందన్నారు. దేశంలో అత్యధిక వరి పండించే రాష్ట్రం తెలంగాణ అన్నారు. కేంద్ర సర్కార్ వివక్ష మూలంగా ఎకరానికి తెలంగాణ రైతాంగం 7 వేల రూపాయలు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పార్లమెంట్ పునర్వ్యవస్థికరణలో సైతం దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపిల స్థానం తగ్గించే విధంగా కేంద్ర సర్కార్ వ్యవహరిస్తుందన్నారు. గోదుమలతో సమానంగా వరికి మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు, తెలంగాణకు చెందిన ఎంపిలు దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వంపై వత్తిడీ తేవాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దసరా పండుగ వేళ ఉద్యోగులకు 3శాతం డిఎ మంజూరు చేసి ఉద్యోగులకు తీపి కబురు చెప్పిందన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉద్యోగులకు 5 డిఎలు పెండింగ్‌లో ఉంచి చేదు ఫలితాలను మిగిల్చిందన్నారు. మాజీ సిఎం కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పటగానే మొదటి సారి 42 శాతం పిఆర్‌సి, రెండవ సారి 31శాతం మొత్తం 73 శాతం పిఆర్‌సి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే ఎప్పటి డిఎలను అప్పుడే విడుదల చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడ రాష్ట్ర ఉద్యోగులకు 5 డిఎలు పెండింగ్‌లో పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పిఆర్‌సి ఊసే ఎత్తటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుతో ప్రభుత్వ ఉద్యోగులు నిరాశతో ఉన్నారు. హోంగార్డులు డ్రెస్ అలవెన్స్‌లు, పోలీస్‌స్టేషన్ అలవెన్స్‌లు బంద్ చేశారన్నారు. బిఆర్‌ఎస్ సర్కార్ అధికారంలో ఉన్నపుడు ప్రతి పోలీస్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం 75 వేల రూపాయలు ఇచ్చిందన్నారు. పోలీసుశాఖకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త వాహనాలు కొనుగోలు చేసి ఇచ్చిందన్నారు. కాని రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి రాగానే వాహనాల్లో డిజిల్ సైతం పోయించటం లేదని, డిజిల్,పెట్రోల్ బకాయిలు పేరుకపోయాయని విమర్శించారు. అలాగే పోలీస్ స్టేషన్ నిర్వహణ నిధులు సైతం ఎత్తివేసిందన్నారు. పోలీస్ కానిస్టేబుల్స్‌కు, సిబ్బందికి సరెండర్ లీవులు విక్రయించి తమ కుటుంబపోషణకు వినియోగించేవారన్నారు. ఇప్పటికి పోలీస్‌కానిస్టేబుళ్లకు 5 సరెండర్ లీవులు, 14, డిఎలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సిసిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్దరిస్తామని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీనిచ్చారని అధికారంలోకి 24 నెలలు కావస్తున్న విస్మరించారన్నారు. ఉద్యోగుల సిపిఎస్ నిధులు సైతం దారి మళ్లించారన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు, ఆశ వర్కర్లకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం జీతాలు ఇవ్వటం లేదన్నారు. రేషన్‌షాపులకు సైతం కమీషన్లు ఇవ్వటం లేదని ఇప్పటికి 5 నెలల కమీషన్ చెల్లించాల్సి ఉందన్నారు. కళాశాలకు ఫీజు రియింబర్స్ చెల్లించకపోవటం కళాశాలలు బంద్ చేస్తామని అల్టిమేటం ఇచ్చారన్నారు. అలాగే ఆరోగ్య శ్రీ నిధులు చెల్లించకపోవటం వల్ల ఆసుపత్రులు సైతం సేవలు బంద్ చేస్తామన్నారు. ఇటు ఆసుపత్రులు, కళాశాలలు. రేషన్‌షాపులు అన్ని బంద్ చేస్తామని అల్టిమేటం ఇచ్చి ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదన్నారు. ఉద్యోగులకు డిఎ అంటే డియర్‌నేస్ అలవెన్స్ అయితే ప్రభుత్వం డోంట్ ఆస్క్ అని కొత్త నిర్వచనం చెప్పిందన్నారు. ఎవరికైన ఉద్యోగ సంఘా ల నేతలు తమ హక్కుల గురించి మాట్లాడితే వారిపై ఎసిబి దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల డిఎ విడుదల చేయటంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు చేసిన పోరాటానికి ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బిఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు అందిస్తుందని స్పష్టం చేశారు. ఈసమావేశంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, గుండు భూపేశ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ దసరా శుభాకాంక్షలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : దసరా పండుగను పురస్కరించుకుని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కమిషన ర్ ఆర్.వి. కర్ణన్ గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రౌర్యంపై శౌర్యం, అసురత్వంపై దైవత్వం, అమానుషంపై మానవత్వం, స్వార్థంపై పరమార్థం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకే విజయదశమి పండుగ నగర ప్రజల జీవితాల్లో ఆనందపు వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.





## నవరాత్రుల అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నవరాత్రులు సంబరాలలో భాగంగా 191 లోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి మహా ప్రసాదం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, పంగా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్



**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ నియోజకవర్గంలో, జిల్లాతోపాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అన్నారు. ఈ విజయదశమి పండుగా సందర్భంగా మీరు చేపట్టిన అన్ని పనులలో సంపూర్ణ విజయాలను సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మీరందరూ బంధుమిత్ర సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి దసరాను ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ అందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



## స్వచ్ఛంధ సేవకుడికి ఆర్టీసి ఘన సన్మానం

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** తనకు ఉన్నదానితో సరిపెట్టుకొని తనవంతు సమాజానికి సేవ చేయాలనే కొంతమందికి మాత్రమే ఉంటుంది. అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా వుంటారు. వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం పులుమామిడి గ్రామానికి చెందిన రత్నమొల్ల రవీందర్ రెడ్డి తన స్వంత డబ్బులతో అను నిత్యం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల చేత ప్రశంసలు అందుకుంటున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా నవాబ్ పేట్ మండల కేంద్రం నుండి మీనపల్లి గ్రామం వరకు ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు స్వంత ఖర్చులతో మరమ్మత్తులు చేయడం అభినందనీయమని కొనియాడుతూ వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ నమ్రత, ఆర్టీసీ అధికారులు బుధవారం రోజున ఆయనకు ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజానికి తన వంతుగా సేవలు అందించాలని ఆలోచించే వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని, అనునిత్యం రత్నమొల్ల రవీందర్ రెడ్డి చేస్తున్న సేవలు చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు కె.గోపాల్, బి.సుదర్శన్, శ్రీశైలం, సురేందర్, దాదాపు 400ల మందికి పైగా ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని తులసి నగర్ కాలనీకి చెందిన ఎండి యూసఫ్ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ తెలుసుకున్న నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ఆదుకునేందుకు ముందుంటానని ఆయన అన్నారు.



## అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన కమిషనర్

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శశాంక్ ఎన్‌క్లేవ్ జై శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవి నవరాత్రులను పురస్కరించుకుని పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా నిర్వహకులు కమిషనర్,నాయకులకు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నిఖిల్ గౌడ్,నాయకులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**నాగారం మున్సిపల్ కార్యాలయంంలో ఆయుధ పూజలు**

నాగారం మున్సిపాలిటీ అవరణలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి వాహనాలకు ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇఇ సంతోష్‌కుమార్,మేనేజర్ సురేష్‌రెడ్డి, రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా దేవీ నవరాత్రులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పదవ రోజు అమ్మవారు సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ఉత్సవాల్లో బుధవారం తిరూ కల్యాణమహోత్సం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుప్పల యాదగిరిరెడ్డి,కార్యానిర్వహణాధికారి మఠం వీరేశం,ఆలయ ఫౌండర్ మెంబర్ పల్లె శ్రీకాంత్ రెడ్డి,మాజీ ధర్మకర్తలు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోమిరెల్లి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.




## నిజాంపేట్‌లో దసరా మహోత్సవ సంబరాలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** అమ్మవారి విశేష అలంకరణ మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిస్తుందనీ మహిషాసుర మర్దిని అమ్మవారు సకల కార్యసిద్ధి, ఎన్నికలలో విజయాన్ని చేకూరుస్తుందనీ కావున ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ధర్మపత్ని కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి, తరుణ్ రెడ్డి, లీడర్ కొలన్ నరసింహారెడ్డి, పద్మమ్మ నిజాంపేట్‌లో వెలసినటువంటి పురాతన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ ప్రథమ అర్చకులు అయినవోలు వెంకట సత్యనారాయణ చార్యులు, అయినవోలు శాండిల్య వారి వేద ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి అమ్మవారికి వేదోత్వంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజన కార్యక్రమాన్ని శ్రీమాన్ పివి సుబ్బారావు, దివ్య గానామృతంతో అమ్మవారి యొక్క భజన కార్యక్రమం అంగరంగ వైభవపోతంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో మేకల వెంకటేష్, కొలన్ భద్రారెడ్డిరెడ్డి, బొర్రా అశోక్, కడియాల ఇందిరా, యాదిలాల్, పంగా శ్రీనివాసరావు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

### గాజుల రామారంలో..

# ప్రభుత్వ భూమి కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హైడ్రాకు ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శ్రవణ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గాజుల రామారం 307 సర్వే నెంబర్ పరిధిలోని ప్రభుత్వ భూమిని కాపాడాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శ్రవణ్ కోరారు. ఈ మేరకు బుధవారం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను కలిసి వారు వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గాజుల రామారం 307 సర్వే నెంబర్‌లో సుమారు 317 ఎకరాల ప్రభుత్వ భూ మి ఉందని, దానిని కాపాడాలని అన్ని ప్రభుత్వ శాఖలకు గతంలో వినతి పత్రం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. కొంతమంది భూస్వాములు దొంగ పట్టాలు సృష్టించి, ఆ భూమిని పేదలకు అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు. నెల రోజుల కిందట హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేయగానే, ఆయన వెంటనే చర్యలు తీసుకున్నారని చెప్పారు. అయితే హైడ్రా కంచె వేసిన తర్వాత కూడా కొందరు వ్యక్తులు దానిని తొలగించి మళ్లీ కబ్జా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు.

ప్రభుత్వ భూమిలో వేసే వెంచర్లకు అధికారులు అనుమతులు ఇచ్చారని, అందుకే 307 సర్వే నెంబర్‌లో వెంచర్‌లలో ప్రజలు ఎవరు భూమి కొనవద్దని ఆయన సూచించారు. ఈ ప్రభుత్వ భూమిని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు మాదవరం కృష్ణారావు చెప్పారు.

**భూమిని కబ్జా చేసిన ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తీసుకోవాలి: బిఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్**

ఎమ్మెల్సీ శ్రవణ్ మాట్లాడుతూ గాజుల రామారంలోని 307 సర్వే నంబర్‌లో ఉన్న 317 ఎకరాల వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన సుమారు వేల కోట్ల విలువైన భూమిని చట్టవిరుద్ధంగా ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ భూమిని కాపాడాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, కబ్జాల తొలగింపు లక్ష్యంగా ఏర్పడిన హైడ్రా ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకుని, అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ క్రమంలోనే తాము హైడ్రా కమిషనర్‌ను కలిశామన్నారు. కమిషనర్ రంగనాథ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని శ్రవణ్ చెప్పారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో సీనియర్ న్యాయవాది రాజేశ్వర్ రావు ఉన్నారు.

# బతుకమ్మకుంట బాధ్యత మీరే చూడాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరిన వి.హెచ్







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను బాగా అభివృద్ధి చేశారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. బతుకమ్మ కుంట నిర్వహణ బాధ్యతను కూడా హైడ్రా తీసుకోవాలి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపి వి. హనుమంతరావు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను కోరారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను బుధవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందచేశారు. కబ్జాల చెర నుంచి బతుకమ్మ కుంటను కాపాడటం, చెరువుగా అభివృద్ధి చేయడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం ఇలా అన్ని కార్యక్రమాలు ఎంతో వైభవం గా జరిగాయని హనుమంతరావు అన్నారు. ఈ విషయంలో హైడ్రా చేసిన కృషి అభినందనీయమన్నా రు. బతుకమ్మకుంటను అభివృద్ధి చేసి వదిలేశారు అనే అపవాదు రాకుండా దీని పరిరక్షణ బాధ్యత ను హైడ్రా తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు చెప్పారు. లేని పక్షంలో ఇక్కడ ప్రస్తుతం ఉన్న ఆహ్లాదకర వాతావరణం దెబ్బతింటుందన్నారు.

**బోటు షికారు కొనసాగించండి..**

బతుకమ్మకుంట ఇప్పుడు పర్యాటక ప్రాంతంగా మారిందని హనుమంతరావు అన్నారు. ప్రారంభోత్సవం నాటి నుంచి నేటి వరకూ అక్కడ ప్రతి రోజు సాయంత్రం సందడి వాతావరణం నెలకుంటుందన్నారు. వందలాది మంది వచ్చి బతుకమ్మ ఆడారన్నారు. వచ్చే ఏడా ది మరింత వైభవంగా బతుకమ్మ ఆటలు ఆడుతారన్నారు. చెరువు అందాలు ఏమాత్రం దెబ్బతినకుం డా చూడాలని కోరారు. ప్రస్తుతం బతుకమ్మకుంటలో ఉన్న బోటు షికారును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. చెరువును చూడటానికి స్థానికేతరులు కూడా వస్తున్నారన్నారు. బతుకమ్మ కుంట సందర్శ న, వ్యాయామ సమయాలను కూడా నిర్దేశించాలని కోరారు. ఆ సమయాలను గేటుపై పెట్టి, నిరంతరం వాచ్‌మ్యాన్‌లు ఉండేలా చూడాలన్నారు. గతంలో ఇక్కడ చెత్త సేకరణ ఆటోలు పార్కింగ్ చేసే వారని, వారికి ప్రత్యామ్నాయ పార్కింగ్ ఏరియా చూపించాలన్నారు. బతుకమ్మ కుంట సందర్శనకు వచ్చిన వాహనదారులు కూడా ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేయకుండా నియంత్రించాలన్నారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణ స్వామి, లక్ష్మ ణ్ యాదవ్ ఉన్నారు.

## జెసిఇఎస్ నాగేశ్వర్ రావు పదవీ విరమణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ సైంటిస్ట్ (జెసిఇఎస్) డి. నాగేశ్వర్ రావు బుధవారం పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా టిజిపిసిబి కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కో లు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్య కార్యదర్శి జి. రవి మాట్లాడుతూ డి. నాగేశ్వర్ రావు చేసిన సుదీర్ఘ సేవలను అభినందించారు. శాస్త్రవేత్తగా ఆయన తన పదవీకాలంలో సమర్థవంతమైన సేవలను అందించారని ప్రశంసించారు. నాగేశ్వర్ రావు పదవీవిరమణ జీవితం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పదవీవిరమణ చేసిన డి.నాగేశ్వర్ రావు మాట్లాడుతూ తనకు సహకరించినందుకు అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. టిజిపిసిబి అధికారులు, సహచరులు ఈ సందర్భంగా ఆయనతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను పంచుకున్నారు. అధికారులు, సిబ్బంది డి.నాగేశ్వర్ రావును శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ బి.రఘు సహా పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బరేలీలో హింస ఘటనలో ఇద్దరు అరెస్టు

**బరేలీ :** ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో సెప్టెంబర్ 26న జరిగిన హింసాకాండలో పాల్గొన్న ఇద్దరు వ్యక్తులను సిబి గంజ్ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులకు బుల్లెట్ గాయాలు అయ్యాయని, ప్రస్తుతం వారు పోలీసు కస్టడీలో చికిత్స పొందుతున్నట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఇద్రీస్, ఇక్బాల్ పొరుగున ఉన్న షాజహాన్‌పూర్ జిల్లాకు చెందినవారని, గత వారం కొత్వాలి ప్రాంతంలో జరిగిన హింసలో వీరు పాల్గొన్నారని సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ (ఎస్ఎస్‌పి) అనురాగ్ ఆర్య తెలిపారు.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా.. లక్ష బెలూన్ల ప్రదర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వ్యాప్తిని నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి. వివేక్ వెంకట స్వామి అన్నారు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరుతో నిర్వహించిన లక్ష బెలూన్ల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ వినూత్న ఆలోచన సమాజానికి అవగాహన కలిగించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి అభినందించారు. వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం చేపట్టింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు శ్రీఇరుకుల్ల రామకృష్ణ మాట్లాడుతూ అక్టోబర్ 1న వాసవి క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని, డ్రగ్స్ అనే సామాజిక వ్యాధికి వ్యతిరేకంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

జాతీయ భావాల ప్రేరణ కోసం 3600 అడుగుల పొడవైన జాతీయ జెండాను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలోని పలు నగరాలలో ప్రదర్శించారని ఆయన గుర్తు చేశారు.

జింఖానా మైదానంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో వాలంటీర్లు, సభ్యులు కలిసి రంగురంగుల లక్ష బెలూన్లను ఆకాశంలోకి ఎగరవేశారు.



## వసంతోత్సవంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్:** అలంపల్లిలోని శ్రీఅనంతబద్మనాభ స్వామి అలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుదధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి మున్సిపల్ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామి వారిని గరుడవాహనంపై ఉరేగింపు చేశారు. గరుడవాహన ఉరేగింపులో పాల్గొని స్వామి వారి పల్లకిని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మోశారు. భక్తులు స్వామికి టెంకాయలు కొట్టి దీపాలు వెలిగించి ప్రత్యేక హారతి ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్, ఆలయ ఇఒ ట్రస్ట్ చైర్మన్ పద్మనాభం, పలువులు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఫర్నిచర్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపిలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఎ ఫర్నిచర్ టౌన్‌ను ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మా రెడ్డి, ఎంపిలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కార్పొరేటర్లు సింగిరెడి శిరీషా సోమశేఖర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. తమకు ఇష్టమైన ఫర్నిచర్‌ను కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారని వారికి తక్కువ ధరకే నాణ్యమైన ఫర్నిచర్‌ను అందించి దినదినాభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.షాపు నిర్వహకులు జలంధర్‌రెడ్డిని వారు అభినందించారు.కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## పట్టుబడిన 67 మద్యం బాటిళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీములు బుధవారం శంషాబాద్ ఏరియాలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 67 నాన్ డూటీ పెయిడ్ లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఏరియాలో..ఏ అండ్ సి ఎస్ టి ఎఫ్ టీం కు సంబంధించి అంజిరెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు ఒకవైపు.. మరోవైపు బి అండ్ డి ఎస్ టి ఎఫ్ టీముల సిఐలు భిక్షా రెడ్డి, నాగరాజు టీములు శంషాబాద్ ఏరియాలో వాహనాలు తనిఖీలు చేపట్టి గోవా హర్యానా ఢిల్లీ ప్రాంతాల నుంచి తీసుకు వస్తున్నటువంటి 67 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం బాటిల్లను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

## ఆసుపత్రిలో చేరిన మల్లికార్జున ఖర్గే

**బెంగళూరు:** ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం రాత్రి బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో చేరారు. శ్వాస సంబంధ సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న ఆయనకు గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు పేస్‌మేకర్‌ను అమర్చాలని వైద్యులు సూచించినట్లు ఆయన కుమారుడు ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. రేపు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందన్నారు. మంగళవారం పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నష్టంపై సమీక్ష నిర్వహించారు. వరద బాధితులకు పరిహారం కోసం ప్రధానికి లేఖ రాస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జనరల్ వార్డులో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను సిఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్‌లు పరామర్శించారు.

# 10వేల ఎకరాలకు పైగా పంట వర్షార్పణం

## పరిహారం కోసం రైతులు వేడుకోలు



**ప్రజాపక్షం /వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలో ఎడతెరపిలేని భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు. లక్షల ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. పత్తి మొక్కజొన్న పరి ఇతర పంటలు నీటి మునిగిపోయాయి. వేలాది రూపాయల పెట్టుబడి నీటిపాలైనందని రైతులు అంటున్నారు. భారీ వర్షాల కారణంగా వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అయితే అదికారులు ప్రభుత్వాని కి ఎటువంటి నివేదికలు పంపనట్లు తెలుస్తుంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలతో పూర్తి పంటనష్టం జరిగింది. ధారూర్, తాండూర్, పరిగి, దోమ, పూడూర్, వికారాబాద్, నవాబుపేట్, బొంరాస్‌పేట్, బషీరాబాద్, యాలాల్, బట్వారం, మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లో కూడా భారీ నష్టం వాటిల్లింది అని రైతులు తెలిపారు. భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం అయింది. ఇంట్లో నుండి బయటకు వేళ్ల లేకపోయారు. ప్రకృతి వైపరీత్యాలకు ఏటా పంటలు దెబ్బతింటున్నా పరిహారం అందం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్యల్లో పెట్టుబడి పెట్టి ఎండన కా వాన నకా కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయానికి వర్షార్పణమవుతున్నాయి. ఐదేళ్లుగా ఇదే పరిస్థితిలో ఉందని పలువురు పేర్కొన్నారు. పంటలు దెబ్బతిన్న సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పర్యటించి ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది పంటలు ప్రారంభ దశలోనే భారీ వర్షాలకు వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షంతో పంట భారీ నష్టం జరిగిం ది. ఎకరానికి రూ.25వేల పరిహా రం అందించాలని ప్రతిపక్షాలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏటా పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం నుంచి పరిహారం మాత్రం అందడంలేదు. ఐదేళ్లుగా ఇదే తంతు సాగుతోంద ని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. గత 15రోజులు గా కురుస్తున్న భారీ వర్షాలు చాలా వరకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తమను అదుకోవాలని రైతులు కోరుతున్నారు.





# ముగిసిన నైరుతి రుతుపవనాల కాలం

### బుధవారం నుంచి ఈశాన్య రుతు పవనాలు మొదలు
### 33 శాతం అధిక వర్షపాతం నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్ : నైరుతి రుతు పవనాల కాలం ముగియడంతో బుధవారం నుంచి ఈశాన్య రుతు పవనాల కాలం మొదలైంది. నైరుతి రుత పవనాల కాలంలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసిశాయి. జూన్ నుంచి జూలై మూడో వారం వరకు వర్షాలు కురువక రైతులను ఇబ్బంది పెట్టినప్పటికీ ఆ తర్వాత గడిచిన రెండున్నర నెలల కాలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో సగటు వర్ష పాతం కంటే 32 శాతం అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. అయితే కొన్ని జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, మరికొన్ని జిల్లాలో అధికం, మరిన్ని జిల్లాలో సాధారణ వర్ష పాతం నమోదైంది.

**జూన్‌లో మాత్రమే లోటు వర్షపాతం నమోదు**

ఈ ఏడాది రాష్ట్రంలో మే 26వ తేదీన నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ జూన్‌లో వేడి గాలుల ప్రభావంతో సరైన వర్షాలు కురువలేదు. దీంతో నెలలో 130.3 మిమీటర్ల వర్షపాతానికి గాను కేవలం 104.2 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో 20 శాతం లోటు నమోదైంది. జులైలో సైతం మూడు వారాలు ఇదే పరిస్థితి కొనసాగినప్పటికీ చివరి రోజుల్లో భారీ వర్షాలు కురువడంతో 227.4 మి.మీలకు గాను 237.9 మి.మీతో 5శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక అగస్టు నెలకు సంబంధించి మాత్రం వర్షాలు దంచి కొట్టడంతో 215.8 మి.మీ.లకు గాను ఏకంగా378.5 మి.మీ. 75 శాతం అధిక వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో సైతం 167.1 మి.మీలకు గాను 267.7 మి.మీ (60 శాతం) అధిక వర్షం కురిసింది. నైరుతి రుతు పవనాల కాలంలో రాష్ట్రంలోని 33 జిల్లాలో 7 జిల్లాల్లో సాధారణ కంటే ( 62నుంచి 92 శాతం వరకు) అత్యధిక వర్షం కురువగా, 16 జిల్లాల్లో (సాధారణం కన్నా 20 నుంచి 59 శాతం వరకు) అధిక వర్షపాతం నమోదైంది. అదేవిధంగా 9 జిల్లాల్లో (8 నుంచి 19శాతం వరకు) సాధారణ వర్షపాతం రికార్డు కాగా, ఒకే ఒక్క జిల్లా పెద్దపల్లిలో మాత్రం సాధారణం కంటే 1 శాతం తక్కువ వర్షపా తం నమోదైంది. మరోవైపు అన్ని మండలాల్లోనూ ఈసారి మంచి వర్షాలే పడ్డాయి. కేవలం మూడు మండలాల్లోనే లోటు వర్షపాతం నమోదైంది.

**7 జిల్లాల్లో అత్యధికవర్షపాతం**

మెదక్ అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో సాధారణ వర్షపాతం 679.4 మీమీలకు గాను 1303.3 వర్షపాతం కురిసింది. ఇది 92 శాతం అత్యధికం అదేవిధంగా యాద్రాది భువనగిరి 931 (74శాతం), సిద్దిపేట 1063 (72 శాతం), మహబూబ్‌నగర్‌లో 896.6 ( 70 శాతం), నాగర్ కర్నూల్ జిల్లాలో815.9 (67శాతం), కామారెడ్డి 1328.7 మిమి (65 శాతం), వనపర్తి 830 ( 62 శాతం ) అత్యధిక వర్షపాతం నమోదైంది.

**16 జిల్లాలో అధిక వర్షపాతం**

నారాయణపేట 784.5 (55శాతం), రంగారెడ్డి 823.6 (49 శాతం), హైదరాబాద్ 920.9 (46 శాతం), జోగులాంబ గద్వాల్ 662.3 (45శాతం), సంగారెడ్డి 947.9(41శాతం), వికారాబాద్ (40 శాతం), మేడ్చల్ మల్కాజ్‌గిరి 840.4 (38శాతం), ఆదిలాబాద్ 1364.4 (36శాతం), వరంగల్ 1102.4 (28శాతం), కరీంనగర్ 935.8 (27 శాతం), నిర్మల్ 1157(27శాతం), ములుగు 1457.4 (26శాతం), కుమురంబీమ్ 1312.8 (26శాతం), సూర్యాపేట 721.1 (25 శాతం), నల్లగొండ 618.2 (24 శాతం) ఖమ్మం 984.2 (24శాతం) చొప్పున అధిక వర్షం కురిసింది.

**10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం**

నిజామాబాద్ 1030.4, జనగాం793.1,భద్రాద్రి కొత్తగూడెం 1158.0, మహబూబాబాద్ 958.4, రాజన్న సిరిసిల్ల 813.7, జయశంకర్ భూపాలపల్లి 1058.1, మంచిర్యాల్ 1043.3, హనుమకొండ 899.6, జగిత్యాల 922.4, పెద్దపల్లి 858.9 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదైంది.

**ఈశాన్య రుతు పవనాలు రంగ ప్రవేశం**

మంగళవారంతో నైరుతి రుతు పవనాల కాలం ముగిసి బుధవారం నుంచి ఈశాన్య రుత పవనాల కాలం మొదలైంది. ఈశాన్య రుతు పవనాలు ప్రారంభంతోనే వారం రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి అది గురువారం నాటికి వాయుగుండంగా బలపడి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకువిస్తరించే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రం మొత్తానికి వాతావరణ శాఖ బుధవారం ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో అక్టోబర్ మొదలు డిసెంబర్‌కు తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా విస్తరంగ్వా వర్షాలు కురుసే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.

## చుక్కా రామయ్యకు పద్మవిభూషణ్ ఇవ్వాలి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల విద్యార్థులను సాంకేతిక సైన్యంగా తయారు చేసి, తరగతి గది ప్రాణంగా జీవించిన స్వాతంత్ర సమరయోధుడు చుక్కా రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ ఇచ్చి సత్కరించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. గాంధీ 156వ జయంతి సందర్భంగా ప్రముఖ గాంధేయవాది, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన 'గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ ' అనే పుస్తకాన్ని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ దేశం ఆత్మ గ్రామమని గాంధీజీ చెప్పారని, తెలంగాణ గ్రామాల విముక్తి కోసం చుక్కారామయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తు చేశారు. డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గాంధీ వ్యక్తి త్వం, ఆయన ఆలోచనలు ఆచరణ, తాత్వికత నేటి కాలానికి ఎంత అవసరమో గ్లోబల్ రోల్ మోడల్ గాంధీ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు.

## ఇంటెలిజెన్స్ చీఫ్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో కీలక విభాగమైన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అదనపు డిజిపి విజయ్‌కుమార్ లక్డికాపూల్‌లోని ఇంటెలిజెన్స్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1997 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన విజయ్‌కుమార్ బీహార్ వాస్తవ్యులు. సైబరాబాద్ డిసిపిగా, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి), నిజామాబాద్ డిఐజిగా, డిజిపి కార్యాలయంలో కోఆర్డినేషన్ ప్లానింగ్ అదనపు డిజిగా, ఎసిబి డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఐపిఎస్ బదిలీలలో ఆయనకు ఇంటెలిజెన్స్ చీఫ్ పదవి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. కొత్తగా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత విజయ్‌కుమార్ డిజిపి శివధర్‌రెడ్డితో పాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## రేవంత్‌రెడ్డి వికలాంగుల ఆత్మబంధువు : వీరయ్య



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఆత్మబంధువు అని వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముట్టినేని వీరయ్య అన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఉద్యోగులందరికి 2010, 2015, 2020 పిఆర్‌సితో కూడిన జీతం ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎంతో పాటు డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను కార్పొరేషన్ చైర్మన్ అయినా తర్వాత మెదటి బోర్డు మీటింగ్ లోనే 2010,2015,2020 పిఆర్‌సి వర్తింపజేయాలి అని తీర్మానం చేసి ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపానని గుర్తు చేశారు.ఈ ఫైల్‌పై సిఎం సంతకం పెట్టడంతో పాటు సెప్టెంబర్ జీతంతో కలిసి పిఆర్‌సి ఇవ్వడం తమకు సంతోషం కల్పించారన్నారు.

















































# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## బలమున్న చోట సిపిఐ పోటీ

ప్రజాపక్షం/చండూరు /గట్టుప్పల : సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను బుధవారం గట్టుప్పల మండల సిపిఐ కార్యదర్శి భీమనపల్లి రమేష్ మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. గట్టుప్పల మండలంలో సిపిఐ రెండు గ్రామ పంచాయితీల తో పాటు రెండు ఎంపిటిసి స్థానాలలో పోటీ చేస్తుందని అందుకు జిల్లా పార్టీ అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంఎల్‌సి సత్యంను కోరారు. ఈకార్యక్రమంలో భీమనపల్లి రమేష్ , వెల్మకన్నె సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి కందాల ముత్యాలు , రైతు సంఘం నాయకులు వల్ల వెంకటయ్య , బషీర్ తదితరులు పాల్గొన్నారు.



## రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు

సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున మిర్యాలగూడ డివిజన్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉందని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేస్తున్నామని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఎవరూ కూడా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదన్నారు. ఆయా చెక్‌పోస్టు వద్ద ఏంసీసీ టీమ్‌లతో తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందని ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని ఎవరూ ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎటువంటి రాజకీయ సమావేశాలు, సభలు నిర్వహించవద్దని సూ చించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేంతవరకు అందరు సహకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, డీఏవో శ్రీనివాస్‌శర్మ తదితరులు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పోటీ

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్



ప్రజాపక్షం/ఆలేరు : స్థానిక సంస్థ ఎన్నికల్లో వార్డ్ మెంబర్ నుంచి జెడ్పిటిసి వరకు జరిగే అన్ని ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని కొల్లూరు గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం తెడ్డు ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వార్డ్ మెంబర్స్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి స్థానాలకు పోటీకి సిపిఐ పార్టీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారన్నారు. సిపిఐ పార్టీ అభ్యర్థుల గెలుపుతోనే గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గ్రామ గ్రామాన సిపిఐ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి సహకరించాలన్నారు. సిపిఐ పార్టీ తరపున పోటీలో పాల్గొనే అభ్యర్థుల పక్షాన సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రచారము నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు కుమ్మరి పాపయ్య, గ్యార రామచంద్రయ్య, మోహన్ రెడ్డి, రామచందర్, ధార నర్సమ్మ, ధార నర్సయ్య, రాంనర్సయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్టు ప్రమాద ప్రాంతాల వద్ద రక్షణ చర్యలు

డిఎస్‌పి రాజశేఖర్ రాజు



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి స్పీల్ వే ద్వారా దాదాపు 5 లక్షల పైన క్యూసెక్కుల వరద నీరు విడుదల అవుతూ ఉండటంతో కృష్ణానది వద్ద జలకళ సంతరించుకుంది. వరదనీరు భారీగా పెరగడంతో వరద పోటెత్తుతున్న పరివాహక ప్రాంతాలు అదే విధంగా పుష్కర ఘాట్ల వద్దకు ప్రజలు, పర్యాటకులు వస్తూ ఉండటం తరచూ ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతూ ఉండటంతో బుధవారం మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో స్థానిక సిఐ శ్రీను నాయక్, ఎస్‌ఐ ముత్తయ్య, తిరుమలగిరి ఎస్‌ఐ వీరశేఖర్, పెద్ద వూర ఎస్‌ఐ ప్రసాద్ రెవెన్యూ అధికారి అనిల్ తో కలిసి సంబంధిత ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద రక్షణ చర్యలను పరిశీలించారు. శివాలయం పుష్కర్ ఘాట్ వద్ద గేట్లను మూసివేయాలని, ప్రమాద భరితంగా ఉన్న ఓపెన్ స్థలాల్లో పెద్ద మొత్తంలో ముళ్ళకంచ వేసి పర్యాటకులు ఎవరిని అటువైపు రాకుండా చూడాలని డి.ఎస్.పి ఆదేశించారు. తాజాగా మంగళవారం హైదరాబాద్ నుంచి వచ్చిన విద్యార్థులలో ఒక విద్యార్థి గల్లంతు అవటం ఆ విద్యార్థి ఆచూకీ ఇంతవరకు లభించకపోవడం గమనార్హం. డిఎస్‌పి వెంట సాగర్ ప్రాజెక్టు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆర్‌ఐ శ్రీనివాస్ రావు, రెవెన్యూ అధికారులు, స్థానిక పర్యావరణ ఇంజనీర్ బాలాజీ ఉన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామంలో ఏర్పాటు చేయాలి

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు వినతి



ప్రజాపక్షం/మర్రిగూడ: ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామంలో ఏర్పాటు వేసి తగిన వసతులు కల్పించాలని మాజీ ఎంపిపి, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రెండు వైద్య కేంద్రాలు ఒకే ఆవరణలో ఉండడం చట్ట విరుద్ధం అని భావించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మండల పరిధిలోని శివన్నగూడ గ్రామం పరిసర ప్రాంతాలలో నివసించే పేద ప్రజలు మండల కేంద్రానికి రాలేక ప్రైవేట్ ఆసుపత్రులలో డబ్బులు వైద్యానికి ఖర్చు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రను ఏర్పాటు చేస్తే వేల మంది పేద ప్రజలకు వైద్య సదుపాయం అందుతుందనే ఉద్దేశంతో శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అప్పటి మండల ప్రజా ప్రతినిధులు తీర్మానం చేశారు.కానీ ఇప్పటివరకు అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేకపోయారని పెర్కొన్నారు. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామంలో ఏర్పాటు చేయాలి కోరారు.

# అక్రమంగా డబ్బులు, మద్యం పంపిణీపై నిఘా

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ: గ్రామపంచాయతీ, జెడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.బుధవారం ఆమె ఉదయాదిత్య భవన్‌లో ఎన్నికల వ్యయ నిర్వహణ కమిటీలు ఎఫ్ఎస్‌టి ,ఎస్ఎస్‌టి బృందాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి బృందాలతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా డబ్బులు, మద్యం, బహుమతులు వంటివి పంపిణీ కాకుండా గట్టి నిఘా ఉంచాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం వంటివి తీసుకు వెళ్తుంటే తక్షణమే వాటిని సీజ్ చేయడం, సీజ్ చేసిన సామాగ్రి మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయించాలని, ప్రతిరోజు నివేదికలను పంపించాలన్నారు. పట్టుకున్న నగదు, మద్యం ,తదితర సామాగ్రి అంతటిని దగ్గర్లోని పోలీస్ స్టేషన్లో డిపాజిట్ చేయాలని చెప్పారు. నగదు వంటివి సీజ్ చేసే సమయంలో అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని ,వైద్య పరమైన కారణాలతో ,వివాహ వేడుకలు,ఇతర వేడుకల సందర్భంగా నగదు తీసుకెళ్లే వారి విషయంలో అన్ని విషయాలు ధ్రువపరచుకొన్న తరువాతే సీజ్ చేయాలని, ఎలాంటి ఆధారాలు లేని నగదు, ఇతర సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్లయితే సీజ్ చేయాలని చెప్పారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమించి పని చేసినట్లయితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బృందాలు తప్పనిసరిగా చెక్ లిస్టు కలిగి ఉండాలని ,అన్ని విషయాలను సమగ్రంగా వీడియోగ్రఫీ చేయించాలని చెప్పారు.అంతకు ముందు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని ,ర్యాలీలు, వాహనాల అనుమతులు తప్పనిసరిగా చూడాలని, ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేసే కమిటీలు జాగ్రత్తగా వీటన్నిటిని పరిశీలించాలన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,జెడ్పి సీఈఓ శ్రీనివాసరావు ,డిపిఓ వెంకయ్య, ఇన్చార్జి డిఆర్‌ఓ వై .అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ బాలు,ఎఫ్ ఎస్ టి ,ఎస్ ఎస్ టి బృందాలు, జోనల్ అధికారులు ,ఎంపీడీవోలు, మోడల్ కోడ్ బృందాలు హాజరయ్యారు.

## 24 గంటల్లోనే చోరీని ఛేదించిన సూర్యాపేట టూటౌన్ పోలీసులు

ఇంట్లో పనిచేసే సహాయకురాలే దొంగతనానికి పాల్పడింది

మొత్తం 55లక్షల విలువైన సొత్తు రికవరీ

సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐ శివతేజ, ఎస్‌ఐ సురేష్‌లకు రివార్డులు

జిల్లా ఎస్‌పి కె నరసింహ వెల్లడి







ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట పట్టణం కృష్ణానగర్ కాలనీలో 80 సంవత్సరాల ఒక వృద్ధురాలి ఇంట్లో జరిగిన దొంగతనం కేసును సూర్యాపేట 2వ పట్టణ పోలీసులు, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా 24 గంటల్లోనే ఛేదించారు. ఇట్టి కేసు వివరాలను జిల్లా ఎస్‌పి కె నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కృష్ణానగర్ కాలనీలో నివాసం ఉండే వృద్ధురాలు ఒంటరిగా ఉండడంతో వారి కుమారులు సేవల నిమిత్తం ఖమ్మం జిల్లా, కూసుమంచి మండ లం, నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన కరీమాబేగంను సహాయకురాలిగా నియమించారన్నారు. ఆమె నమ్మకంగా పనిచేస్తూ వృద్ధురాలి వద్ద తాళం చేతులు గమనించి ఆమె ఇంట్లో ఉన్న 40 తులాల బంగారు బిస్కెట్లు (4 బిస్కెట్లు), మూడున్నర తులాల బంగారు చంద్రహారం, రూ.1.75 లక్షల నగదును అపహరించింది. వృద్ధురాలి కుమారులు ఇంట్లో బంగారం, డబ్బు కనిపించకపోవడంతో సూర్యాపేట పట్టణ పోలీసులకు తేది.29.09.2025న ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదుపై దొంగతనం కేసు నమోదు చేసి పట్టణ పోలీసులు దర్యాప్తు చేయగా ఇంటి వద్ద అనుమానాస్పదంగా ఉన్న పనిమనిషి కరీమాబేగంను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకుందన్నారు. ఆమె వద్ద నుండి బంగారం, నగదును రికవరీ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు వివరించారు. బంగారం విలువ 53 లక్షలు, నగదు కలుపుకొని మొత్తం 55 లక్షల సొత్తును సూర్యాపేట పట్టణ పోలీసులు రికవరీ చేశారన్నారు. కేసులో బాగా పని చేసిన సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐ శివతేజ, ఎస్‌ఐ సురేష్, సూర్యాపేట పట్టణ పోలీసు సిబ్బంది, సిసిఎస్ సిబ్బందిని ఎస్‌పి అభినందించి రివార్డ్స్‌ను అందజేశారు. ఈ సమావేశంలో డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్‌ఐలు శివతేజ, సురేష్ సిబ్బంది ఉన్నారు.

# ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: గంజాయి సేవిస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో గల అగ్రహారంకు చెందిన దివాకరుని శ్రీనివాస్‌పవన్‌కుమార్, కనకాదండి హరిదత్త భరద్వాజ్‌లు గుంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటుపడి వివిధ ప్రదేశాల్లో గంజాయిని కొనుగోలు చేసి తాగేవారని తెలిపారు. దివాకరుని శ్రీనివాస్‌పవన్‌కుమార్ అతను ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ చదివే క్రమంలో సిగిరెట్లు, మద్యానికి, మత్తుమందులకు బానిసయ్యాడని తెలిపారు. అదేక్రమంలో ఇతను ఇండియాకు వచ్చిన తరువాత కూడా తాను పనిచేసే వివిధ ప్రదేశాల్లో గంజాయిని సేవించేవాడని అన్నారు. ఇతను కొంతకాలం క్రితం మిర్యాలగూడ పట్టణంలో గల ఒక నర్సింగ్ హోమ్‌లో డాక్టర్‌గా కూడా పని చేశాడని, ప్రస్తుతం పట్టణంలోని డాక్టర్స్‌కాలనీలో నివాసం ఉంటూ ఆన్ కాల్ మీద పనిచేస్తున్నాడని తెలిపారు. వారం రోజుల క్రితం అతని సొంత ఊరు ఏలూరుకి వెళ్లి అక్కడ తిరుగుతన్న సమయంలో ఏలూరు పరిసర ప్రాంతాల్లో ఒక గుర్తు తెలియని వ్యక్తి చిన్నచిన్న ప్యాకెట్లుగా గంజాయి అమ్ముతుండడంతో అతని వద్ద సుమారు 250 గ్రాముల గంజాయిని రూ.2వేలకు కొనుగోలు చేసి తీసుకొచ్చాడని తెలిపారు. అతను మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో కూడా కొందరి వద్ద గంజాయి కొనుగోలు చేశాడని, ఆ తరువాత అతని స్నేహితుడు హరిదత్త భరద్వాజ్‌కు ఫోన్ చేసి రమ్మనగా అతడు మిర్యాలగూడకు రావడంతో అక్కడ గంజాయి తాగుదామని స్కూటీపై వెళ్తుండగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై పోలీసు వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 110గ్రాముల ఎండు గంజాయి, ఒక స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకోని వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రాంబాబు, ఏఎస్‌ఐ చంద్రయ్య,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలను అధిక సంఖ్యలో గెలిపించాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అధిక సంఖ్యలో పోటీ చేసి గెలుపొందాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ అన్నారు. బుధవారం ఆయన కాబోయే బీసీ ప్రజాప్రతినిధులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో విడుదల చేసిన సందర్భంలో బీసీ నాయకులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నందున బీసీ నాయకులు అధిక సంఖ్యలో జనరల్ స్థానాల్లో కూడా పోటీ చేసి విజయం సాధించాలన్నారు. రిజర్వేషనుల ఎవరి దయ కాదని మన హక్కు అనే విధంగా ప్రపంచానికి తెలియచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## మిర్యాలగూడ ఎంవిఐగా చంద్రశేఖర్



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా వి.చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నాగార్జునసాగర్ చెక్‌పోస్టులో ఎంవీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఫుల్ అడిషనల్ చార్జిగా మిర్యాలగూడకు బదిలీ చేశారు. చంద్రశేఖర్ 2012 బ్యాచ్‌కు చెందగా తొలుత హైద్రాబాద్, కోదాడ, నారాయణపేట, నిజామాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఎంవీఐగా పనిచేశారు. సంవత్సరంన్నర క్రితం నాగార్జునసాగర్ చెక్‌పోస్టు వద్ద ఎంవీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేట్ బస్సుల ఫిట్నెస్ విషయంలో అన్ని తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని అన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాపక్షం/అర్వపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008/09 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాభోదన చేసిన ఉపాధ్యాయులను సన్మానించి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. ఉపాధ్యాయులు పద్మజా ప్రభాకర్ రెడ్డి, సురేంద్ర, కుర్ర శ్రీనివాస్, దావల మల్లికార్జున్, సంతోష, పూర్వ విద్యార్థులు శంకర్, జనార్ధన్, ప్రసాద్, నరేష్, రాంబాబు, సురేష్, శేఖర్, మధు, బాలకృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

## శమీ పూజకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రతి సంవత్సరం విజయదశమి సందర్భంగా గురువారం సాయంత్రం జరుగు శమీ పూజ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హనుమంతరెడ్డి తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల మండల పరిషత్ కార్యాలయంలో శమీ పూజ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌ల ఏర్పాటుతో పాటు శమీ పూజ నిమిత్తం జమ్మిచెట్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు పెద్దఎత్తున



పాల్గొంటారని తెలిపారు. క్యూలైన్‌లతోపాటు, మంచినీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. శానటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, శ్రీసంతోషిమాత దేవాలయ కమిటి సభ్యులు బ్రాహ్మండ్లపల్లి మురలీధర్, పబ్బా ప్రకాష్ రావు, గోపారపు రాజు, మున్సిపల్ సిబ్బంది వేణు పాల్గొన్నారు.




## రాజకీయ పార్టీలు సహకరించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో జడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ విసి హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్, అభ్యర్థులు ఎన్నికల్లో ఉపయోగించే వాహనాలు, మైక్‌లు, భోజనాలు, ఫ్లెక్సీ, లేబర్ చార్జీలు, కరపత్రాలు, పోస్టర్లు, ఎల్ఈడి స్క్రీన్‌లు తదితర అంశాలకు చెందిన వస్తువుల ధరల వివరాలు రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు. మున్సిపాలిటిలలో ఎన్నికల కోడ్ అమలులో లేదని తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రాంతాలలో కొత్తగా ఎటువంటి పథకాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, గ్రౌండింగ్ వంటివి ఉండవని తెలిపారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని, అసత్య ప్రచారాన్ని ప్రసారం చేసినచో తగు చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల విషయంలో రాజకీయ నాయకులు సహకరించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఇఓ అప్పారావు, జిల్లా పంచాయితి అధికారి యాదగిరి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు హాజరయ్యారు.

## అధిక వడ్డీ ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్న ముఠా అరెస్ట్




ప్రజాపక్షం/దేవరకొండ : డిండి పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్తూట్ మిని ఫైనాన్షియర్స్ లిమిటెడ్ డిండి బ్రాంచ్‌లో చోటు చేసుకున్న మోసపూరిత గోల్డ్ లోన్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పి మౌనిక వివరాలను వెళ్ళడిస్తూ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన రమావత్ శ్రీరాములు ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు డిండి మండల పరిధిలోని హజ్యతండాకు చెందిన అంగోతు వెంకటేష్ తనను తానుగా పరిచయం చేసుకొని తన బంగారం ముత్తూట్ మిని ఫైనార్షియర్స్ లిమిటెడ్ డిండి బ్రాంచ్‌లో ఉందని తన యొక్క బంగారాన్ని డబ్బు కట్టి విడిపిస్తే ప్రతి లక్ష రూపాయలకు రోజుకు రూ. 3వేలు ఇస్తానని, డబ్బులు ఉన్నప్పుడు బంగారం విడిపించుకుపోతానని నమ్మించి, బాధితులు డబ్బులు చెల్లించిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా ముత్తూట్ మిని ఫైనార్షియర్స్ లిమిటెడ్ డిండి బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇద్దరు నిందితుల కలిసి బాధితుల వద్ద నుండి రూ. 6,67,350లను వసూలు చేశారని తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ. 4,50,000ల నగదు, నకిలీ రసీదులు, రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పి మౌనిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అధిక వడ్డీ ఇస్తామని చెప్పి మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధిక వడ్డీ ఇస్తామని వస్తే వెంటనే స్థానిక పోలీస్ వారికి తెలియజేయాలని సూచించారు.

## నర్సరీని సందర్శించిన డిఆర్‌డిఒ పిడి



ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్: తిరుమలగిరి మండలంలోని అల్వాల గ్రామంలోనే గ్రామ నర్సరీని నల్గొండ జిల్లా డిఆర్‌డిఓ పిడి రాజశేఖర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి నర్సరీ నీ ,రికార్డులు తనిఖీ చేసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలో ఈజీఎస్ స్టాఫ్ ను, నర్సరీ ప్రోగ్రెస్‌ను ,ఈ కేవైసీ ,పి ఎం ఎస్ బి వై అప్డేషన్ను ,రిజిస్టర్ జాబ్ కార్డ్స్, సెర్ప్ మహిళ సంఘాల పై రివ్వు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ఏపిఎం రాజేశ్వరి, ఈజీఎస్ స్టాఫు, సెర్ప్‌సిసిలు, విఓఏలు, పొదుపు సంఘ ల మహిళలు ఉన్నారు.



## క్రీడల్లో పోటీతత్వం ఉండాలి

ప్రజాపక్షం /హాలియా: ఆటల పోటీల్లో పోటీ తత్వం అలవర్చుకొని పట్టుదలతో సాధన చేసి ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలని పిసిసి డెలిగేట్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్ రెడ్డి భానుచందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, వినయ్ రెడ్డి, కాకునూరి నారాయణ గౌడ్, భగవాన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యంపాల్గొన్నారు.

# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** ప్రజలు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి అన్నారు. నవరాత్రి ఉత్సవాలలోభాగంగా కల్వకుర్తి మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరై గ్రామంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో లింగసానిపల్లి ఉత్సవకమిటి సభ్యులు కిరణ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌చారి, వినోద్‌రెడ్డి, సత్యం, బాలయ్య, గణేష్, రాజుగౌడ్, రాఘవేందర్, కుర్మయ్య, లింగారెడ్డి పాల్గొన్నారు.



## జిల్లావ్యాప్తంగా నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ డి. జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు అనగా అక్టోబర్ 1 వ తేది నుండి 31 వరకు మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. కావున మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేనిదీ ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని సూచించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకులు పోలీసు విభాగానికి సభకరించవలసిందిగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

## ఎన్నికల నిర్వహణపై శిక్షణ



**ప్రజాపక్షం/కృష్ణ:** నారాయణపేట్ జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఎంపీటీసీ జడ్పీటీసీ రెండవ సాధారణ ఎన్నికలలో భాగంగా ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు, ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడబడింది. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లుగా నాగభూషణ్, నరేందర్ వ్యవహరించాను. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి, గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్, ప్రిసైడింగ్ ఆఫీసర్లు నిర్వర్తించవలసిన బాధ్యతలు, ఎన్నికల నియమావళి అలాగే ఎన్నికల ప్రక్రియను సక్రమంగా నిర్వహించే విధానాలపై విపులంగా శిక్షణ ఇచ్చారు.

## మాజీ మంత్రి మాతృమూర్తి పార్థివదేహానికి ప్రముఖుల నివాళులు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి మాతృమూర్తి చర్లకోల లక్ష్మ మ్మ బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని వారి నివాసంలో స్వర్గస్తులయ్యారు. లక్ష్మ మ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ప్రముఖులు నివాళులర్పించిరు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి జైపాల్ యాదవ్ రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈ విషాద సందర్భంగా డా.లక్ష్మారెడ్డి , వారి కుటుంబ సభ్యులందరికీ కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మ మ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## మహిషాసుర మర్దిని మాతగా దుర్గామాత



**ప్రజాపక్షం/బిజినేపల్లి:** మండల పరిధిలోని పాలెం శ్రీ అలర్మేల్ మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శరను నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గా అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దిని అవతారంలో అలంకరించారు. పద్మావతి మాతృమండలి ఫ్రెండ్స్ యూత్ క్లబ్ సభ్యులు అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కొరివి రామానుజ చార్యులు, జయం తు, వంశీకృష్ణచార్యుల ఆధ్వర్యంలో గణపతి, నవగ్రమ, దుర్గా హోమం, పూర్ణహుతి శ్రీ సూక్తం ఆధారంగా వేదమంత్రోచరణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సిబ్బంది ఆర్.శివకుమార్. ఈ కార్యక్రమంలో పద్మావతి మాతృమండలి సభ్యులు, రాజేశ్వరి, రజిత, మంజుల, పద్మ, వాని భాయ్, లక్ష్మి దేవమ్మ, కవిత, ఫ్రెండ్స్ యూత్ క్లబ్ సభ్యు లు ఆనంద్, వినయ్, ఆనంద్ సింగ్, కార్తీక్ కుమార్, సన్నీ, నర్సింహా, శశిధర్, శ్రీనివాస్, నీలాధర్, నాగిరెడ్డి, శేఖర్, శ్రీను, మురళి, ఆర్చిత్ సాయి, అక్షయ్ సాయి, కృష్ణ తేజ, మనిచంద్ర, లక్ష్మ ణ్, భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## అగ్రోరైతు సేవా కేంద్రం కలెక్టర్ తనిఖీ

యూరియా పంపిణీ పరిశీలన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** చిన్నచింతకుంట మండల కేంద్రంలో అగ్రో రైతు సేవా కేంద్రం 2ను జిల్లా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం తనిఖీ చేశారు. యూరియా, ఎరువుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. పంపిణీ సక్రమంగా జరుగుతుందా తెలుసుకున్నారు. రైతులకు యూరియా ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ఆగ్రో రైతు సేవా కేంద్రం ద్వారా యూరియా ఎరువులు విత్తనాలు, పురుగుమందులకు కచ్చితంగా రైతులకు రసీదులు ఇవ్వాలని స్పష్ట చేశారు. యూరియా కొరత లేదని ఎప్పటికప్పుడు కొరత లేకుండా రైతులకు ఆగ్రోస్ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి ఉన్నారు.

**ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి**

జిల్లాలో జరగబోయే ఎంపిటిసి, జడ్‌పిటిసి గ్రామపంచాయతీ సర్పంచ్, ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించి, సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. బుధవారం కలెక్టరేట్ విసి కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహణకు సహకరించాలన్నారు. జిల్లాలో జడ్‌పిటిసి, ఎంపిటిసి రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటినీ, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు వ్యయ పరిమితి ఎన్నికలు నిబంధనలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్‌ను వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టిలను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈఓ, వెంకటరెడ్డి, డి.పి.ఓ పార్థ సారథి, ఆర్.డి.ఓ నవీన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కన్నులపండువగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గత పదిరోజులుగా వైభవంగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం శ్రీమహిషాసురమర్ధినిదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతసేవ అభిషేకాలు దంపతులచే కుంకుమార్చన, భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం, చండిమహా హోమం నిర్వహించినట్లు దేవాలయ చైర్మన్ ఫౌండర్‌ట్రస్టు జూలూరిరమేష్ బాబు, ఉత్సవ కమిటి అధ్యక్షుడు గందెరవిలు తెలిపారు. అమ్మవారిని జిల్లా పౌరసరఫరాల అధికారులు డిఎస్‌ఓ నర్సింగ్‌రావు, డిఎం రాజేందర్, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరందరిని దేవాలయ చైర్మన్ ఫౌండర్ ట్రస్టు జూలూరిరమేష్‌బాబు, ఉత్సవకమిటి అధ్యక్షుడు గందెరవి, ఉత్సవ కమిటి సభ్యులు మెమోంటోతో సన్మానం చేశారు. అదేవిధంగా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి బంగారుకిరిటంకోసం దొంతు రాంమోహన్ తులం బంగారం, గుండ మధుసూదన్ అర్ధతులం బంగారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవకమిటి సలహాదారు వాసశేఖర్, కమిటిప్రధాన కార్యదర్శులు గుండ్లరేవంత్, నితిన్, కోశాధికారిలు పోలగిరిబాబు, సంబతరుణ్, ఆర్యవైశ్యసంఘం నాయకులు, సభ్యులు, అనుబంధసంఘాల నాయకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## టిటిడి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు



**ప్రజాపక్షం/ఉట్కూర్ :** టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పాలమూరు జిల్లా వారి ఆధ్వర్యంలో మన గుడి 2025 ఆశ్వయుజ మాస శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మూడు రోజుల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని టిటిడి ఉమ్మడి పాలమూరు జిల్లా ఉపాన్యాసకులు దొరోల్ల కృష్ణయ్య తెలిపారు. బిజ్వార్ శ్రీ చౌడేశ్వరి మాత దేవాలయంలో మంగళవారం రాత్రి ప్రవచనం లో భాగంగా నవరాత్రుల విశిష్టత, విజయదశమి, మహిషాసుర మర్ధిని మొదలగు అంశాల గురించి వివరించారు. బుధవారం రాత్రి లలిత సహస్రనామ పారాయణం, రేపు అన్నమాచార్య సంకీర్తనల కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందు ధర్మం యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధ్ధంగా టిటిడి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. వేదాలు, పురాణాలు, రామాయణం, భాగవతం, భగవద్గీత లోని అనేక విషయాలు ప్రచారం చేస్తూ సమాజంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రతి వ్యక్తి మన సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తూ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉండాలని తెలిపారు. మానవుతంతా ఒక్కటే అనే భావం కల్గించి హిందులు అందరూ కలిసి మెలసి జీవించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చిన వచ్చిన ఉమ్మడి పాలమూరు జిల్లా కార్యనిర్వహణ అధికారి ఉత్తరపల్లి రామాచార్యులు కు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్. నర్సింహా, రాజమూరి, తిరుపతి, శ్రీనివాసులు, బాల నర్సింహా, కవిత, మంగమ్మ, బసమ్మ, కిష్టమ్మ, లక్ష్మి , మంజుల, కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో విజయదశమి పండుగను పురస్కరించుకొని ఎల్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం వెల్దండ మాజీసర్పంచ్ ఎన్నంభూపతిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి , మాజీ ఉపసర్పంచ్ ఎండి ఆలీ, నాయకులు అన్వర్‌పాష ప్రారంభించారు. ఈసందర్భంగా వెల్దండ మాజీసర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థులు , యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులకు చేయూతనందిస్తున్న కల్వకుర్తి మార్కెట్‌కమిటి చైర్మన్ మనీలాసంజీవ్‌యాదవ్, లింగారెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ ఎండి ఆలీ, గ్రామనాయకులు ఎండి అన్వర్‌లను అభినందించారు. కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి, కొప్పు శ్రీను, షాబుద్దిన్, ప్రదీప్, ప్రశాంత్, రవి, రషీద్, కృష్ణయ్య, శేఖర్, స్వామి, శ్రవణ్, రఫీ, జాంగీర్, నిజాం పాల్గొన్నారు. అదేవిధంగా కొట్రగ్రామంలో పానుగోటిరవీందర్ ఆధ్వర్యంలో కొట్ర ప్రీమియర్ లీగ్ 6 నిర్వహించారు. కార్యక్రమంలో కొట్రసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రవీందర్‌రావు, కడారి శ్రీనివాస్ యాదవ్, షాంపూరి అల్లాజి, మల్లేష్, ఆర్గనైజర్లు అంజి, అశోక్, క్రీడాకారులు గుమ్మకొండపరమేష్, చంటి, మహేందర్, సిద్దు, పరమేష్ పాల్గొన్నారు.




## దేశాన్ని కంటికి రెప్పలాగ కాపాడే సంస్థ



హిందూ వాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి

**ప్రజాపక్షం/బిజినేపల్లి:** దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే ఒక గొప్ప సంస్థ ఆర్ఎస్ఎస్ అని హిందు వాహని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి అన్నారు. విజయదశమి పర్వదినం స్థాపించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పాలెం ఖండ ఆధ్వర్యంలో బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించారు. వక్తగా హాజరైన యాదిరెడ్డి మాట్లాడుతూ దేశంలో నిత్య శాఖ ద్వారా అనేకమంది స్వయం సేవకులను దేశ భక్తులుగా యువకులను తయారు చేస్తూ జాతీయ వాద సిద్దాంతం ద్వారా నిత్యం, నిరంతరం, దేశంలో ఈ ధర్మం కోసం కృషి చేస్తుందన్నారు. స్వచ్ఛమైన నిష్కలమైనటువంటి ఈ దేశానికి అసలైన పునాది ఆర్ఎస్ఎస్ అని అన్నారు. దేశము ధర్మము జాతీయత భావాలు దేశం ఎప్పుడు సస్యశ్యామలంగా ఉండాలని కోరుకునేది. ఒక్క ఆర్ఎస్ఎస్ మాత్రమేనన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో తన అనుభావాలతో హేడ్గేవార్ బాగా ప్రభావితమయ్యారని, భారతదేశ సాంస్కృతిక గుర్తింపును కాపాడటానికి ప్రోత్సాహించడానికి ఐక్యమైన, క్రమశిక్షణ కలిగిన సమాజాన్ని సృష్టించడానికి ప్రయత్నించారని తెలిపారు. శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన పదసంచలనం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీధుల వెంట మహిళలు చిన్నారులు పూలవర్షంతో భగవత్ ధ్వజానికి స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ పుప్పాల శ్రీనివాస్ గౌడ్, పతాంజలి యోగ రాష్ట్ర అధ్యక్షులు వస్పరి శివుడు, ముఖ్య శిక్షక్ జాకీర్ హుస్సేన్, శిక్షకులు విష్ణు, మహేష్, స్వయం సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేడు కొండారెడ్డిపల్లికి సిఎం రాక

**ప్రజాపక్షం/వంగూర్ :** విజయదశమి వేడుకలను పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంతగ్రామమైన కొండారెడ్డిపల్లికి విచ్చేస్తున్న సందర్భంగా బుధవారం కొండారెడ్డిపల్లి గ్రామంలో జిల్లా ఆడిషనల్ కలెక్టర్ అమరేందర్, జిల్లా ఎస్‌పి వైభవ్‌రఘునాథ్, రాష్ట్ర వ్యవసాయ వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా కెవిఎన్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయం 11గంటలకు హెలిక్యాప్టర్‌ద్వారా కొండారెడ్డిపల్లి గ్రామానికి చేరుకొని సాయంత్రం 4గంటలవరకు దసరా వేడుకల్లో పాల్గొని అనంతరం కొడంగల్ నియోజకవర్గానికి బయలుదేరుతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిరాక సందర్భంగా జిల్లా యంత్రాంగం గట్టి భద్రత ఏర్పాట్లు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ జనార్దన్‌రెడ్డి, డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మురళిమోహన్, దీప్తి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎస్ఐ మహేష్, నాయకులు బికేరెడ్డి వేమారెడ్డి, వెంకటయ్య, యాదయ్య, రాఘవేందర్,శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిభావంతోనే ఒత్తిడినుంచి విముక్తి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** భక్తిభావంతోనే ఒత్తిడినుంచి విముక్తి అని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం అన్నారు. బుధవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో దుర్గమ్మతల్లి చిత్రపటానికి పూలమాలవేసి ఆస్పత్రిలోని సామాగ్రికి ఆయుధపూజలు నిర్వహించారు. అనంతరం సిబ్బందితో కలిసి బతుకమ్మ పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఆటపాటలతో పని ఒత్తిడి నుంచి విముక్తి కలిగేవిధంగా ఈకార్యక్రమాలు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు విష్ణు, యశోద, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌ఒసి అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని పోచమ్మగడ్డ గ్రామపంచాయతీకి చెందిన గత మూడురోజులక్రితం వెల్దండవద్ద ప్రమాదంలో సిద్దార్థ్‌కి తీవ్రగాయాలైనిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పోచమ్మగడ్డ తండా మాజీసర్పంచ్ వరలక్ష్మి పంతులనాయక్ పరామర్శించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన రూ.2,50,000 ఎల్‌ఓసిని బాధిత కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా పోచమ్మగడ్డతండాకు చెందిన వద్యావత్‌శాంతికి రూ.19వేల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌తోపాటు నాయకులు జైరాంనాయక్, రాజునాయక్, లక్ష్మన్‌నాయక్, శంకర్‌నాయక్, రమేష్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

## ఇంటినిర్మాణానికి సిమెంట్ అందజేత



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన కొండేటి మంజుల, గొడుగువెంకటేష్ ఇండ్లు అసంపూర్తిగా ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టుచైర్మన్, మిషన్‌భగీరథ మాజీ వైస్‌చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉప్పలవెంకటేష్ ఒక్కొక్కరికి 25బ్యాగులచొప్పున 50బ్యాగుల సిమెంట్ అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్లసురేష్‌గౌడ్, దేవయ్య, గణేష్, శివ, అశోక్ పాల్గొన్నారు.

## రైతులకు వరి బోనస్ వెంటనే చెల్లించాలి

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/ ధన్వాడ:** తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి యాసంగి వరి ధాన్యం క్వింటాల్కు ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ వెంటనే చెల్లించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి యాసంగి వరి ధాన్యం క్వింటాల్కు 500 రూపాయలు బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. గత సంవత్సరం రైతులు ప్రభుత్వం బోనస్ అందిస్తుందనే ఉద్దేశంతో గంపెడు ఆశలతో ప్రభుత్వానికి ధాన్యం అమ్మారు. కానీ నేటికీ సంవత్సరం గడుస్తున్నా రైతన్న కి బోనస్ అందలేదు ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే గీత బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో అధికారం కోసం ప్రజలకు అనేక వాగ్దానాలు చేసింది అందులో ప్రధానమైన వాగ్దానాలు రైతులకు రైతు బంధు ఇస్తామని వరి ధాన్యానికి క్వింటాల్కు 500 రూపాయలు చొప్పున బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఇవి కాక ఆరు గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చింది. అధికారం చేతికి వచ్చిన తర్వాత వాటి అమల్లో ఎలాంటి చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. మోసపూరిత మాటలతో పాత ప్రభుత్వాల బాటల్లోన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని వృద్ధులు వికలాంగులు మహిళలు నిరుద్యోగులు ఇలా అనేకమంది మోసపోయారన్నారు. ముఖ్యంగా రైతంగాన్ని నట్టేట ముంచారన్నారు. రైతంగానికి రైతుబంధు లేదు రైతు బోనస్ అతిగతి లేదు ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇది ఇలా ఉంటే ప్రకృతి వైపరీత్యం అతివృష్టి వల్ల రైతులు పత్తి మొక్కజోన్న వరి తదితర పంటలను వేసి తీవ్రంగా నష్ట పొయ్యారు అన్నారు. సమస్యలను పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు.

## కిడ్నీ వైఫల్యంతో ఆరుగురు పిల్లలు మృతి

రెండు దగ్గు సిరప్‌లపై నిషేధం

**భోపాల్:** కిడ్నీ వైఫల్యం వల్ల 15 రోజుల్లో ఆరుగురు పిల్లలు మరణించారు. ఆ చిన్నారులు వినియోగించిన రెండు రకాల దగ్గు సిరప్‌లు విషపూరితమైనట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో అధికార యంత్రాంగం వాటిని నిషేధించింది. మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో ఈ ఘటన జరిగింది. పరాసియా, న్యూటన్ చిక్లి, సమీప గ్రామాలకు చెందిన ఐదేళ్ల లోపు పిల్లలు జ్వరం, జలుబు, దగ్గు బారిన పడ్డారు. స్థానిక డాక్టర్లు జ్వరం మందులతోపాటు దగ్గు సిరప్‌లు రాశారు. వాటిని వాడిన పిల్లలు కొద్దిగా కోలుకున్నారు. ఆ తర్వాత వారిలో కిడ్నీ సమస్యలు తలెత్తాయి. కాగా, మెరుగైన చికిత్స కోసం కొందరు పిల్లలను మహారాష్ట్రలోని నాగ్‌పూర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ముగ్గురు చిన్నారులు మరణించారు. సెప్టెంబర్ 7 నుంచి 20 వరకు 15 రోజుల్లో మూత్రపిండాల ఇన్ఫెక్షన్ కారణంగా ఆరుగురు పిల్లలు చనిపోయారు. కిడ్నీ బయాప్సీలో షాకింగ్ విషయం బయటపడింది. ఔషధ విష ప్రయోగానికి సంబంధించిన విషపూరిత రసాయనం డైథిలిన్ గ్లైకాల్ కారణంగా చిన్నారుల కిడ్నీలు పాడైనట్లు నిర్ధారణ అయ్యింది. మరోవైపు బాధిత చిన్నారులు ఎక్కువగా కోల్డ్‌ఫ్, నెక్స్ట్రోడిఎస్ దగ్గు సిరప్‌లు వినియోగించినట్లు అధికారుల దర్యాప్తులో తెలిసింది. దీంతో చింద్వారా కలెక్టర్ శీలేంద్ర సింగ్ అప్రమత్తమయ్యారు. ఆ రెండు రకాల దగ్గు సిరప్‌ల అమ్మకాలను జిల్లా అంతటా నిషేధించారు. డాక్టర్లు, మందుల షాపులతో పాటు ప్రజలను అలెర్ట్ చేశారు. ప్రభావిత గ్రామాల నీటి నమూనాలలో ఎలాంటి ఇన్ఫెక్షన్ కనిపించ లేదని కలెక్టర్ తెలిపారు. చిన్నారుల మూత్రపిండాల వైఫల్యానికి కలుషిత ఔషధం కారణమన్నది బయాప్సీ నివేదిక బలంగా సూచిందని వెల్లడించారు.






















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com